thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 113| జగిత్యాల | బుధవారం 22 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

హాకీ వరల్డ్ కప్ జట్టును ప్రకటించిన భారత్



11



## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధమే: ఇరాన్ అధ్యక్షుడు
- ప్రపంచవ్యాప్తంగా అమెరికన్లకు భద్రతా హెచ్చరికలు
- హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతతో చమురు సరఫరాపై ఆందోళన

వివరాలు 4లో..

## పాక్‌తో సింధూ జలాల ఒప్పందం



- ఇప్పుడున్నట్లుగా కొనసాగడం కుదరదు
- కృతనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం

4

## నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని

- పిల్లలను రెచ్చగొట్టదన్న మోడీ
- నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

4





## హాకింపేట ఎడ్యుకేషన్ హబ్ పనుల్లో

# వేగం పెంచండి

### సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

వికారాబాద్ జిల్లా హకీంపేటలో నిర్మిస్తున్న కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెలా పనుల పురోగతిని స్వయంగా సమీక్షిస్తానని, అవసరమైతే ఒక రోజు నిర్మాణ ప్రాంగణంలోనే బస చేసి పనులను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. హకీంపేటలో నిర్మాణంలో ఉన్న కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్‌ను సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఇంజినీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ-పారా మెడికల్ కళాశాలలు, విద్యార్థుల వసతి గృహాల నిర్మాణ పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

- ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతి తనిఖీ..
- నెలకో రోజు సైట్‌లోనే బస చేస్తా
- అలసత్వం వహిస్తే సస్పెన్షన్ తప్పదు..
- భూబాధితులకు వారంలోగా ప్లాట్ల పట్టాలివ్వాలి
- మక్తల్ - నారాయణపేట్ - కొడంగల్ ఎత్తిపోతల భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి
- కొడంగల్ నియోజకవర్గంలో రోడ్డు లేని తండా ఉండకూడదు.. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు

వివరాలు 3లో..

## దేశ యువత కోసం రాహుల్ పోరాటం



హైదరాబాద్, జులై 21: యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

# ప్రధాని నివాసం ముట్టడి

- రాహుల్ సహా నేతల అరెస్ట్
- నీట్ నిరసనలకు రాజకీయ మలుపు
- మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ ధర్నా
- రాహుల్, ప్రియాంక, ఖర్గే సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు



'నీట్' పేపర్ లీక్ వ్యవహారంలో సోమవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై జరిగిన పోలీసు లాఠీచార్జీకి నిరసనగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్, మిత్రపక్షాల నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద భారీ ధర్నా చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం చేపట్టిన ఈ ఆందోళనతో ప్రధాని నివాసం పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కేరళ సీఎం పినరాయి విజయన్‌లతో పాటు పలువురు ఇండియా కూటమి ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థులపై అణచివేతకు నిరసనగా నాయకులు చేతులకు సంకెళ్లు వేసుకుని నినాదాలు చేశారు.

వివరాలు 4లో..

## కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా
దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం
రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
మీడియా సమావేశంలో హరీష్ రావు



2



## దేవాదుల పంపులు ఇక 24 గంటలు పనిచేస్తాయి

- 9 పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో ప్రారంభం
- ప్రజలకు నీటి భద్రతే ప్రభుత్వ లక్ష్యం... రాజకీయాలు కాదు
- కాళేశ్వరం కాంట్రాక్టర్ల నుంచి బీఆర్‌ఎస్‌కు 1400 కోట్లు
- కవిత ఆరోపణలకు హరీశ్ రావు సమాధానం చెప్పాలి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3



## జీహెచ్‌ఎంసీ ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు

3

## డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ముఖాముఖి

- ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి కార్పొరేషన్
- చట్టబద్ధత ఇవ్వాలని జేఏసీల డిమాండ్

3



## నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా

- వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా
- కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బీఆర్‌ఎస్ నేత కేటీఆర్
- పార్టీ తరపున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం అందజేత

వివరాలు 3లో..



## ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి

2





# నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన ప్రధాని

## పిల్లలను రెచ్చగొట్టదన్న మోడీ

## నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**న్యూఢిల్లీ,జులై 21 :** నీట్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. పేపర్ లీక్ ఘోర పాపమని, ఇలాంటివి మళ్లీ జరగకూడదని వ్యాఖ్యానించారు. బాధ్యులకు కఠిన శిక్ష విధించాలని, ఇలాంటి లీక్‌లను నివారించడం జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. 'మంగళ్ మిలన్' పేరిట మంగళవారం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ మేరకు ప్రధాని మాట్లాడారు. ఆయన మాట్లాడిన అంశాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలి. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉందని ప్రధాని సూచించారు. 'పిల్లలను రెచ్చగొట్టొద్దు. తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభం. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టం. వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో ప్రధాన పోటీ పరీక్షల్లో ఒకటైన నీట్ (ఔఇఇ÷) మేలో నిర్వహించగా.. పేపర్ లీక్ ఆరోపణలతో జూన్‌లో మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానంలోనూ లోపాలు వెలుగుచూశాయి. అలాగే మరికొన్ని లీకేజీ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'చలో పార్లమెంటు' తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో దిల్లీ రణరంగాన్ని తలపించింది. ఈ నేపథ్యంలోనే మోదీ స్పందన వచ్చింది.

# సింగరేణి మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష

## యాజమాన్యానికి ఏఐటీయూసీ నేతల వినతి పత్రాలు

**కొత్తగూడెం, జులై 21:** ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని మైన్స్, విభాగాల్లో వినతిపత్రాలు సమర్పించారు. పిలుపులో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా సుమారు 2 వేల మంది కార్మికులు ఏళ్ల తరబడి మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తుండగా, కేవలం 120 మందికి మాత్రమే బోర్డు నిర్వహించడం అన్యాయమని పేర్కొన్నారు. వారిలో 28 మంది కార్మికులకు మెడికల్ బోర్డుకు హాజరుకావాల్సిన సమాచారం కూడా సకాలంలో అందకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హాజరైన 120 మంది కార్మికుల్లో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని తెలిపారు.

# పోలీసుల అదుపు నుంచి నిందితుడు పరార్

## బాధ్యులైన పోలీసులకు ఛార్జ్ మెమో

**నిజామాబాద్, జూలై 21:** పోలీసుల కళ్లుగప్పి ఓ నిందితుడు పరారయ్యాడు. తప్పించుకున్న ఒక నిందితుడి కోసం ఉన్న నిదితుడిని తీసుకుని బయలుదేరగా, అతను తప్పించుకున్నాడు. వివరాల్లోకి వెళితే..నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు శనివారం డ్రంక్ అండ్ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నంబర్ లేని బైక్ పై వచ్చిన ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి బైక్ అక్కడే వదిలేసి పరారయ్యారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు వారిని వెంబడించగా ఒకరు తప్పించుకుపోగా మరో అనుమానితుడు పోలీసులకు చిక్కాడు. దీంతో అతని తనిఖీ చేయగా అతడి వద్ద బంగారు గొలుసు లభించడంతో అనుమానితునితోపాటు, బైక్ ను సైతం తదుపరి విచారణ నిమిత్తం సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) పోలీసులకు అప్పగించారు. పోలీసుల అదుపులో ఉన్న సదరు నిందితుని విచారించగా అతడు కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందినవాడిగా పోలీసుల విచారణలో అంగీకరించారు. అయితే సదరు నిందితుడి వెంట ఉండి పరారైన మరో అనుమానితుడు అతడి సమీప బంధువేనని పోలీసుల విచారణలో తేలింది. అయితే అదుపులో ఉన్న అనుమానితుడి వద్ద లభించిన బంగారు గొలుసు ఎక్కడికైనా విచారించగా నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల పరిధిలో ఓ మహిళ వద్ద నుండి చోరీ చేసినట్లుగా సీసీఎస్ పోలీసుల విచారణలో అనుమానితుడు అంగీకరించినట్లు తెలిసింది. అయితే అతడి వెంట ఉండి పరారైనా మరో నిందితుడి వివరాలు అడగగా, పారిపోయిన నిందితుడు తన సమీప బంధువని పోలీసుల విచారణలో తెలిపాడు. పరారైన మరో నిందితుడిని పట్టుకునేందుకు పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిజామాబాద్ సిసిఎస్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న ఓ సీఐ ఆధ్వర్యంలో బృందాన్ని కరీంనగర్ జిల్లాకు పంపించారు. తమ అదుపులో ఉన్న అనుమానుతుని వెంటబెట్టుకొని అక్కడి వరకు వెళ్లిన సీసీఎస్ టీం కండ్లు కప్పి ఆ దొంగ పరారైనట్లు తెలిసింది. పోలీసులకు పట్టుబడిన 24 గంటల వ్యవధిలోనే అనుమానితుడు వారి చెర నుండి పారిపోవడంతో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సీసీఎస్ బృందంపై సీరియస్ గా పరిగణించినట్లు తెలిసింది. అంతేకాకుండా క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అనుమానితుడు పరారీకి బాధ్యులుగా చేస్తూ సీసీఎస్ సీఐ తో పాటు అతని వెంట వెళ్లిన సిబ్బందికి పోలీస్ బాస్ ఛార్జ్ మెమో ఇచ్చినట్లు పోలీస్ అధికారుల ద్వారా తెలిసింది.

# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

- నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా
- దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం
- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్‌రావు



**హైదరాబాద్, జులై 21:** కాళేశ్వరం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపగిరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళ్లు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్షాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు. దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళ్లు ఇవ్వమని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

# దేవాదుల పంపులు ఇక 24 గంటలు పనిచేస్తాయి

## 9 పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో ప్రారంభం

## ప్రజలకు నీటి భద్రతే ప్రభుత్వ లక్ష్యం... రాజకీయాలు కాదు

## కవిత ఆరోపణలకు హరీశ్ రావు సమాధానం చెప్పాలి

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 21 :** దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఈ రాత్రి నుంచే 9 పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు పగిర్తి సామర్థ్యంతో పనిచేస్తాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో తనను కలిసిన మీడియాతో ఆయన చిట్-చాట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల దేవాదుల ప్రాజెక్టుపై మంత్రుల బృందం నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. గోదావరి నుంచి వీలైనంత ఎక్కువ నీటిని ఎత్తిపోసి, దేవాదుల పరిధిలోని 9 జిల్లాలకు చెందిన 22 రిజర్వాయర్లను నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు పంపులను గరిష్ట సామర్థ్యంతో నడపాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయ విమర్శలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేయడం మానేసి, కాళేశ్వరం ప్రాజెక్టులో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో మొదట రూపొందించిన షీట్ పైల్ ఫౌండేషన్ డిజైన్‌ను ఎందుకు మార్చి సెకెంట్ పైల్ ఫౌండేషన్ అమలు చేశారో హరీశ్ రావు వివరించాలని మంత్రి ప్రశ్నించారు. ఆ నిర్ణయం వల్లే ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు ఈ పరిస్థితికి చేరుకుందని అన్నారు. అలాగే, కాళేశ్వరం కాంట్రాక్టర్లు బీఆర్ఎస్‌కు రూ.1,400 కోట్లు చెల్లించారని ఎమ్మెల్సీ కే. కవిత చేసిన ఆరోపణలపై హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రైతులను తప్పుదోవ పట్టించడం మానేసి, ఆ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులను వేగవంతం చేసి 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పగిర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ÷-రాజెక్టు పగిర్తయిన తర్వాత సుమారు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తాగునీటి భద్రత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

## ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం

## వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి

## కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి

## హన్మకొండలో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హన్మకొండ, జులై 21:** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పగిర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పగిర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశు సంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవగిరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, జూలై 21:** ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పగీట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలంలోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

చురకలు



# హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనుల్లో వేగం పెంచండి



- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతి తనిఖీ..
- నెలకో రోజు సైట్‌లోనే బస చేస్తా
- అలసత్వం వహిస్తే సస్పెన్షన్ తప్పదు..
- భూబాధితులకు వారంలోగా ప్లాట్ల పట్టాలివ్వాలి
- మక్తల్ - నారాయణపేట్ - కొడంగల్ ఎత్తిపోతల భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి
- కొడంగల్ నియోజకవర్గంలో రోడ్డు లేని తండా ఉండకూడదు.. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళికలు

**వికారాబాద్/కొడంగల్:** వికారాబాద్ జిల్లా హకీంపేటలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్' నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను తీవ్రంగా ఆదేశించారు. ఇప్పటినుంచి ప్రతి నెలా పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో తానే స్వయంగా తనిఖీ చేస్తానని, తనిఖీల సమయంలో నెలకు ఒకరోజు నిర్మిస్తున్న సైట్‌లోనే బస చేస్తానని ప్రకటించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో భాగమైన వివిధ విద్యా సంస్థల భవన నిర్మాణాలను, పరిసర ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలను ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్, మెడికల్, నర్సింగ్, వెటర్నరీ, ఫిజియోథెరపీ మరియు పారా మెడికల్ కాలేజీలతో పాటు విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించి అధికారులకు కీలక సూచనలు చేశారు. కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్ పనులు మందకొడిగా సాగుతుండటంపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన నెలవారీ పురోగతి నివేదికలను తనకు ఎప్పటికప్పుడు అందించాలని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఎంతటి అధికారులైనా సహించేది లేదని, నిర్లక్ష్యంగా ఉంటే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడొద్దని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు పునరావాస ప్లాట్ల కేటాయింపులో జాప్యం జరగడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం, రాబోయే వారం రోజుల్లోగా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్లాట్ల పట్టాలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

## కడా పనులపై సమీక్ష:

అనంతరం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. మక్తల్–నారాయణపేట్ – కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులపై అధికారులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని, అవసరమైన సర్వేయర్ల నియామకంతో పాటు కావాల్సినంత బడ్జెట్ విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియను వేగంగా పగ్రిర్తి చేసి తక్షణమే టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని స్పష్టం చేశారు. కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో సాగుతున్న వివిధ అభివృద్ధి పనులను శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు.

## ఏ తండాలోనూ రోడ్డు లేదనే మాట వినిపించొద్దు:

నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి ఖచ్చితంగా బీటీ రోడ్డు అనుసంధానం ఉండాలని, కొడంగల్ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేని తండా ఉందనే మాటే వినిపించకూడదని అధికారులను హెచ్చరించారు. నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు భవనాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని, పనుల పర్యవేక్షణకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారిని నియమించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం మరియు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటన, సమీక్షా సమావేశంలో స్థానిక ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డిలతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దేశ యువత కోసం రాహుల్ పోరాటం

యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.





# డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీతో ముఖాముఖి

## ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి పర్మినెంట్ కార్పొరేషన్

## చట్టబద్ధత ఇవ్వాలని జేఏసీల డిమాండ్

**హైదరాబాద్, జులై 21:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సంప్రదింపులు కొనసాగిస్తోంది. మంగళవారం వైద్యులు, న్యాయవాదులు, విలేఖరులుసమక్షంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు మరియు వివిధ వర్గాల అగ్రశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు, అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు), ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్), ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్), టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. సమావేశానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా హాజరై కమిటీకి తమ పగ్రిర్తి మద్దతును ప్రకటించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల ప్రతులను కమిటీ ప్యానల్‌కు సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు పక్రియను పగ్రిర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పందిస్తూ.. 'నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్ ఛార్జీగా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పగ్రిర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు. పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రాన్ని సాధించారని, వారి ప్రతి డిమాండ్ అత్యంత సమంజసమైనదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, ఈ విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిస్తామని స్పష్టం చేశారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు

**హైదరాబాద్, జులై 21:** జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చించకుండా దీన్ని అమలు చేస్తున్నారు. ꠰రాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయాలన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

# ములుగు జిల్లాలో విస్తారంగా వర్షాలు

## జోరు వానలకు తెగిపోయిన రోడ్డు

**ములుగు, జూలై 21:** ములుగు జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. వాజేడు మండలంలోని జాతీయ రహదారి 163 పై ఇసుక వాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో సగటున 7.66 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లో గరిష్ఠంగా 11 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది. ఆయా చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు.



# నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా

## వారికి రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా

## కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన కెటిఆర్

ఆదిలాబాద్, జూలై 21: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేదు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేదు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్సెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చేరకున్న కేటీఆర్ లక్సెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.



# హైకోర్టులో హైడ్రా కమిషనర్‌కు చేదు అనుభవం

## గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని సెక్యూరిటీ సూచన

## రంగనాథ్ వ్యవహార శైలిపై హైకోర్టు ఆగ్రహం

**హైదరాబాద్, జూలై 21:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో చేదు అనుభవం ఎదురైంది. వీఐపీలు ప్రవేశించే గేట్ నంబర్ 6 నుంచి కాకుండా, సామాన్య ప్రజలు ప్రవేశించే గేట్ నంబర్ 4 నుండి వెళ్లాలని రంగనాథ్‌కు సెక్యూరిటీ సిబ్బంది సూచించారు. దీంతో గేట్ నంబర్ 4 వద్ద సామాన్య ప్రజలు వాహనాలు పార్క్ చేసే స్థలంలో కారు పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ కోర్టులోకి వెళ్లారు. కాగా, ప్రైవేట్ ఆస్తి వివాదంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఒకే అంశానికి సంబంధించి ఏకంగా మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవడం అత్యంత తీవ్రమైన విషయమని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం వెనుక కారణమేమిటని నిలదీసింది. ప్రైవేటు ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని స్పష్టమైన ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని లెకచేయకుండా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించింది. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన అలవాటుగా మారిందా? కోర్టు ధికరణనే పరిపాటిగా మార్చుకున్నారా? అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకటి కాదు, రెండు కాదు, ఒకే అంశంపై మూడు కోర్టు ధికరణ పిటిషన్లు దాఖలవుతున్నా యంటే కోర్టు ఉత్తర్వుల పట్ల ఎంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్న దని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టుల పట్ల ఎంత గౌరవం ఉన్నదో ఈ పరిణామాలే చెప్తున్నాయని పేరొంది. ఇకడ బాధితుడు పిటిషనర్ కాదని, స్వయంగా కోర్టేనని ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధికరించడం ఎంతమాత్రం సహించబోమని రంగనాథ్‌కు తేల్చిచెప్పింది. ప్రభుత్వమైనా, ప్రభుత్వాధికారులైనా చట్టానికి అతీతులు కాదని స్పష్టం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల పరిరక్షణ పేరుతో కోర్టు ఉత్తర్వులను పకనపెట్టి ప్రైవేటు భూముల్లోకి వెళ్లడం ఏ చట్టం ప్రకారం సమర్థనీయమని ప్రశ్నించింది. యజమాని అనుమతి లేకుండా ప్రైవేటు భూమిలో అడుగు పెట్టరాదన్న ప్రాథమిక సూత్రం తెలియదా అని నిలదీసింది. ప్రభుత్వ భూమిని రక్షించడమే లక్ష్యమైతే ప్రైవేటు వ్యక్తిపై పోలీసు ఫిర్యాదు ఎందుకు చేశారని ప్రశ్నించింది.



# ఉరుముతున్న యుద్ధమేఘాలు!

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు మళ్లీ కమ్ముకోవడంతో ప్రపంచదేశాలు దిక్కుతోచని స్థితికి చేరాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కూడా మళ్లీ తీవ్రస్థాయికి చేరింది. నియంతల కారణంగా ప్రపంచానికి శాంతి లేకుండా పోతోంది. వాళ్లు,వాళ్లు కొట్టుకు చస్తున్నా ఫర్వాలేదు.. ఇందులో మిగతా దేశాలు తల్లడిల్లి పోతున్నాయి. ముఖ్యంగా అమెరికా మళ్లీ ఇరాన్‌పై భీకరదాడులుకు దిగుతోంది. ట్రంప్‌ను అంతమొందిస్తాం అంటూ ఇరాన్‌లో పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. అలాగే ప్రపంచంలోని అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా ప్రజలకు హెచ్చరికలు చేసింది. ఈ క్రమంలో యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చనుందన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో చమురు సమస్యలు మళ్లీ మొదటికి అన్నట్లుగా పరస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్‌ను సర్వనాశనం చేసే వరకు వదలనని ట్రంప్ భీష్మించుకున్నారు. ఇప్పుడు ఇజ్రాయిల్ వెనక్కి తగ్గగా అమెరికానే యుద్దాన్ని ఎగదోస్తోంది. మరోవైపు అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ వేడెక్కింది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పగీర్తి స్థాయి యుద్ధం చేస్తోందని ప్రకటించారు. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హర్మూజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్యత ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తో పాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, వాటిని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదని తెలిపారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్నప్పటికీ.. దాన్ని ఎక్కువ రోజులు అధీనంలో ఉంచుకోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒక వేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధం దాదాపు ఐదు నెలలు కావస్తోంది. అయినా అగ్గి చల్లారడం లేదు. ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ట్రంప్ మళ్లీమళ్లీ దాడులకు తెగిస్తున్నారు. తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండ బోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ గతంలోనే స్పష్టం చేశారు.శాంతి ఒప్పందానికి చిల్లు పెట్టారని, ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది అమెరికా మోసపగీరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి చర్చలు జరగడం లేదు. ఇకపై మంచివాడిగా ఉండను అని గతంలో ట్రంప్ చేసిన హెచ్చరికలు తాజా పరిస్థితికి అద్దం పడుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్ని తమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచదేశాలు కూడా పెద్దగా స్పందించడం లేదు. ఏ దేశం కూడా ఈ సుదీర్ఘ యుద్దానికి అడ్డుపడడం లేదు. ఇరాన్ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. అయితే ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. తాడోపేడో తేల్చుకునేదాకా వదిలేది లేదని హెచ్చరికలు చేస్తోంది. అలాగే అమెరికా స్థావరాలపై భీకర దాడులు చేస్తోంది. ఈక్రమంలో ఈ యుద్ధం ఇప్పట్లో ముస్తుందని అనుకోవడానికి లేదు. ప్రపంచదేశాలు ఏకమైతే తప్ప యుద్ధ పరిస్థితులను అదుపు చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది.

# ప్రధాని నివాసం ముట్టడించిన కాంగ్రెస్

- రాహుల్ సహా నేతల అరెస్ట్
- నీట్ నిరసనలకు రాజకీయ మలుపు
- మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ ధర్నా
- రాహుల్, ప్రియాంక, ఖర్గే సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు





**న్యూఢిల్లీ,జులై 21 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవ హారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ



పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధమే చేస్తున్నాం: ఇరాన్ అధ్యక్షుడు
- ప్రపంచవ్యాప్తంగా అమెరికన్లకు భద్రతా హెచ్చరికలు జారీ
- హోర్ముజ్ జలసంధి ఉద్రిక్తతతో చమురు సరఫరాపై ఆందోళన







**టెహ్రాన్/వాషింగ్టన్, జూలై 21:** అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు మరింత తీవ్రమవుతుండటంతో పశ్చిమాసియాలో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. తమ దేశం ప్రస్తుతం అమెరికాతో పగీర్తి స్థాయి యుద్ధ పరిస్థితిని ఎదుర్కొంటోందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రకటించారు. మరోవైపు, పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులు దిగజారుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా పౌరులకు అమెరికా విదేశాంగ శాఖ ప్రత్యేక భద్రతా హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మాట్లాడుతూ, ప్రస్తుతం యుద్ధం కేవలం సైనిక రంగానికే పరిమితం కాదని, ఆర్థిక రంగంలోనూ తీవ్రమైన పోరాటం కొనసాగుతోందని తెలిపారు. యుద్ధ పరిస్థితుల్లోనూ ప్రజల జీవనోపాధిని కాపాడడం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా మారిందన్నారు. దేశ ప్రజలు ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. గత కొద్ది రోజులుగా ఇరాన్‌లోని పలు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు కొనసాగిస్తుండగా, అందుకు ప్రతిగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా ప్రయోజనాలు, సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు చేస్తోంది. ఈ పరిణామాలతో హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన ఈ మార్గంలో ఉద్రిక్తతల ప్రభావం అంతర్జాతీయ చమురు సరఫరాపై పడే అవకాశముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ పౌరులకు అమెరికా విదేశాంగ శాఖ 'వరల్డ్‌వైడ్ కాషన్' పేరుతో ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. విదేశాలకు వెళ్లే అమెరికన్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. జనసమ్మర్థ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని, సమీపంలోని అమెరికా రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని, స్థానిక అధికారుల సూచనలను అనుసరించాలని అమెరికా విదేశాంగ శాఖ సూచించింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ భద్రత, అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తుండటంతో ప్రపంచ దేశాలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి.

# పాక్‌తో సింధూనదీ జలాల ఒప్పందం

- ఇప్పడున్నట్లుగా కొనసాగడం కుదరదు
- కృతనిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ, జూలై 21:** సింధూ జలాల ఒప్పందం ప్రస్తుత రూపంలోనే మళ్లీ అమల్లోకి వచ్చే అవకాశమే లేదని తెలుస్తోంది. ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించాల్సి వస్తే.. మార్పులు తప్పనిసరి అని భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రదర్శిస్తోంది. అది కూడా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విడనాడితేనే సాధ్యమవుతుందని చెబుతోంది. ఈ మేరకు ప్రభుత్వవర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. గతేడాది పహల్గాం దాడి తర్వాత భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గట్టి బుద్ధి చెప్పింది. ఇరు దేశాల మధ్య ఆరు దశాబ్దాలకుపైగా ఉన్న సింధూజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. అయితే.. ప్రస్తుతానికి ఆ ఒప్పందం నుంచి వైదొలగాలని ప్రభుత్వం ఆలోచించడం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఏ అంతర్జాతీయ ఒప్పందమైనా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు తేలితే.. ఒక సార్వభౌమ దేశంగా దానిని రద్దు చేసే హక్కు భారత్‌కు ఉందని పేర్కొన్నాయి. సింధూ జలాల విషయంలో భారత నిర్ణయం పాకిస్థాన్ చర్యలపైనే ఆధారపడి ఉంటుందన్నాయి. ఆ ఒప్పందం నిలిపివేసినప్పటి నుంచి ఉక్కిరిబిక్కిరి అవుతోన్న పాక్.. సింధూ జలాల్లో తమ వాటా తీసుకుంటే తీవ్రపరిణామాలు తప్పవని ప్రేలాపనలు చేస్తోంది. ఒప్పందం నిలిపివేత వల్ల ఆ దేశంలో నీటికొరత ఏర్పడుతోందని చేస్తోన్న ప్రకటనలను భారత్ ఖండిస్తోంది. నీటిని నిల్వ చేసే సామర్థ్యాలు లేకనే భారతదేశాన్ని నిందిస్తూ.. పాక్ తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్ పదేపదే ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ.. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దాయాది అర్థవంతమైన చర్యలు తీసుకున్న దాఖలాలు ఏవీ లేవన్నాయి. అదీగాక ఐక్యరాజ్యసమితి నిషేధిత జాబితాలో ఉన్న వ్యక్తులు పాక్‌లో బహిరంగ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారని ఎండగట్టాయి. పశ్చిమ నదులైన జీలం, చినాబ్‌లపై జమ్మూకశ్మీర్‌లో నిర్మితమవుతున్న జల విద్యుత్ కేంద్రాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఆ ప్రాజెక్టులను ఆలస్యం చేసేందుకు ఒప్పందంలోని వివాదాల పరిష్కారాలకు సంబంధించిన నిబంధనలను పాక్ దుర్వినియోగం చేస్తోందని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్ , పాకిస్థాన్‌ల మధ్య 1960లో ఒప్పందం కుదిరింది.

# వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం అప్రమత్తం: మంత్రి

**హనుమకొండ, జూలై 21**




ఎల్ నీనో ప్రభావంతో ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు దేవసేనను ప్రత్యేక అధికారిగా నియమించామని చెప్పారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నిరంతరం నివేదికలు సమర్పిస్తారని తెలిపారు. వర్షాభావ పరిస్థితులపై సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నామని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ విప్ డా. రాంచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి, మురళీ నాయక్, ప్రత్యేక అధికారి దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, కేవీకే–ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవల నాణ్యత పెంపుపై కలెక్టర్ దృష్టి

**పెద్దపల్లి, జూలై 21 :**




ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత నాణ్యంగా అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో పర్యటించిన ఆయన పాఠశాలలు, పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయాలు, ఎస్ఐఆర్ ప్రక్రియ, సింగరేణి భూములు, ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్కును పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రాథమిక నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని, కమాన్‌పూర్ నూతన తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆగస్టు 1 నుంచి సేవలు ప్రారంభించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరచడం, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే సింగరేణి భూముల సర్వే, రామగిరి తహసీల్దార్ కార్యాలయం, మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# రెండేళ్లుగా కార్యాలయ నంబర్ కరువు..

- **తాళ్లపల్లి సబ్‌స్టేషన్ వినియోగదారుల అవస్థలు**
- **విద్యుత్ సమస్యలపై ఎవరిని సంప్రదించాలో తెలియక రైతులు, ప్రజల ఆందోళన**

**చేవెళ్ల, జూలై 21 :**



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని తాళ్లపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు గత రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్‌స్టేషన్‌కు అధికారిక కార్యాలయ మొబైల్ నంబర్ లేకపోవడంతో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు ప్రజలకు ఎలాంటి మార్గం లేకుండా పోయింది. విద్యుత్ అంతరాయం ఏర్పడినా, నిర్వహణ పనుల కోసం సరఫరా నిలిపివేసినా, సాంకేతిక లోపాలు తలెత్తినా ఎవరిని సంప్రదించాలో తెలియక ప్రజలు అయోమయంలో పడుతున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోయిన ప్రతిసారీ ప్రజలు లైన్‌మెన్‌లు, అసిస్టెంట్ ఇంజినీర్ లేదా ఇతర ఉద్యోగుల వ్యక్తిగత మొబైల్ నంబర్ల కోసం వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. వారి నంబర్లు అందుబాటులో లేకపోతే గంటల తరబడి విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక ఎదురుచూడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారిక కార్యాలయ నంబర్ ఉంటే ఒకే ఫోన్ కాల్‌తో సమాచారం లభించేదని అంటున్నారు.

## రైతులు తీవ్ర ఇబ్బందులు

వ్యవసాయ సీజన్‌లో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. మోటార్లకు విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక పలుమార్లు పొలాలకు వెళ్లి తిరిగి రావాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పంటలకు సకాలంలో నీరందించేందుకు అవకాశం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహ వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే అది స్థానిక లోపమా, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యా, ఫీడర్ ట్రిప్పింగ్ కారణమా, లేక నిర్వహణ పనుల కోసమా అనే విషయం తెలుసుకునే అవకాశం లేకపోవడంతో అనవసర ఆందోళన నెలకొంటోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులను వెంటనే సంప్రదించలేకపోతున్నారు. విద్యుత్ తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లలో లోపాలు, స్పార్కింగ్ వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా సమాచారం ఇవ్వడానికి అధికారిక నంబర్ లేకపోవడం భద్రతాపరమైన ఆందోళనలకు దారితీస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. ఫిర్యాదు నమోదు ఆలస్యం కావడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా ఈ సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాళ్లపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు వెంటనే ప్రత్యేక కార్యాలయ మొబైల్ నంబర్ కేటాయించి, ఆ నంబర్‌ను సబ్‌స్టేషన్ ప్రాంగణం, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో ప్రదర్శించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే విద్యుత్ అంతరాయాలు, నిర్వహణ పనులపై ముందస్తు సమాచారం అందించే వ్యవస్థను ఏర్పాటు చేసి వినియోగదారుల ఇబ్బందులను తొలగించాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# దేవాదులపై ప్రభుత్వ నిర్లక్ష్యం.. రైతులను మోసం చేసింది కాంగ్రెస్: హరీశ్ రావు

**హైదరాబాద్, జూలై 21 :**




దేవాదుల ఎత్తిపోతల పథకంలో నీళ్లు ఉండి కూడా పంపులు పూర్తి స్థాయిలో నడపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 22 రిజర్వాయర్లు నింపి 3.17 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. సమ్మక్క బ్యారేజీలో నీటి నిల్వలు, గోదావరిలో ప్రవాహం ఉన్నప్పటికీ పది పంపుల స్థానంలో కొద్ది పంపులే నడుపుతున్నారని విమర్శించారు. దేవాదుల ద్వారా 105 టీఎంసీల నీరు ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లిపోగా ప్రభుత్వం కేవలం 1.9 టీఎంసీల నీటినే ఎత్తిందని, దీంతో వరంగల్ జిల్లాలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు వెంటనే సాగునీరు అందించి, నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవాదులలో 10 మోటార్లను పూర్తి స్థాయిలో నడిపి 22 రిజర్వాయర్లను నింపాలని, లేకపోతే వరంగల్, నల్గొండ, కరీంనగర్ జిల్లాల రైతులతో కలిసి బీఆర్ఎస్ ప్రజా ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు.

# రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ: సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, జూలై 21 :**



రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఎకో టూరిజం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆదాయం కూడా వృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. కిన్నెరసాని, అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు, నల్లమల, ఆదిలాబాద్, ములుగు ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి, పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రాజెక్టులు చేపట్టాలని చెప్పారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమన్వయంతో మౌలిక వసతులు కల్పించాలని, ఫ్యూచర్ సిటీ, అనంతగిరి, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో ఎకో టూరిజాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా పర్యాటక అభివృద్ధి చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

## నేటి నుంచి క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు

**హైదరాబాద్, జూలై 21:**

క్యూర్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల కోసం ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. సమీపంలోని మీ సేవ కేంద్రం లేదా మీ సేవ వాట్సాప్ (8096958096) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

మీ సేవ పోర్టల్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేయడంతో పాటు అప్లికేషన్ స్థితిని కూడా తెలుసుకునే అవకాశం కల్పించారు. వాట్సాప్‌లో 8096958096 నంబర్‌కు "Hi" పంపి చాట్‌బాట్ సూచనల మేరకు ఆధార్ వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే ముందు అవసరమైన పత్రాల స్కాన్ కాపీలు లేదా స్పష్టమైన ఫోటోలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం సేవలను మరింత పారదర్శకంగా, సులభంగా ప్రజలకు అందించడమే ఈ చర్య లక్ష్యమని పేర్కొన్నారు.

## బ్రిటన్ కొత్త ప్రధాని ఆండీ బర్న్ హామ్ కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, జూలై 21:**

బ్రిటన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆండీ బర్న్‌హామ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్–బ్రిటన్ దేశాలు ప్రజాస్వామ్య విలువలతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, రక్షణ, ప్రజల మధ్య సంబంధాల్లో బలమైన భాగస్వామ్యాన్ని కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెల నుంచి CETA అమల్లోకి రావడంతో ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. భారత్–యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించి, ఉమ్మడి విజన్–2035 లక్ష్యాల సాధనకు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.

## ఆగస్టు 30లోగా అన్ని బీసీ గురుకులాల తనిఖీలు పూర్తి చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, జూలై 21**

మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థలన్నింటినీ ఆగస్టు 30లోగా పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఆర్‌సీవో వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి కనీసం ఆరు గురుకులాలను సందర్శించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని, సైకాలజిస్టులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు జరగకుండా ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సొంత భవనాలు లేని గురుకులాలకు భూముల సేకరణ వేగవంతం చేయడంతో పాటు రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, మొక్కల సంరక్షణ, మౌలిక వసతుల మెరుగుదలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల కనీసం 15 గురుకులాలను తాను, కమిషనర్, కార్యదర్శి ఆకస్మికంగా తనిఖీ చేస్తామని మంత్రి హెచ్చరించారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపులో జర్నలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి: టీయుడబ్ల్యూజే



**హైదరాబాద్, జూలై 21**

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను ఉద్యమకారులుగా గుర్తించి, వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ కోరారు. ట్యాంక్ బండ్ లోని తెలంగాణ అమర జ్యోతిలో నిర్వహించిన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో జర్నలిస్టులు వార్తల ప్రసారానికే పరిమితం కాకుండా తెలంగాణ ఆకాంక్షను దేశవ్యాప్తంగా చాటిచెప్పారని అన్నారు. ర్యాలీలు, ధర్నాల్లో ప్రత్యక్షంగా పాల్గొని, లాఠీచార్జీలు, తప్పుడు కేసులు, కెమెరాల ధ్వంసం, ఉద్యోగ నష్టాలు వంటి ఇబ్బందులు ఎదురైనా ఉద్యమానికి అండగా నిలిచారని పేర్కొన్నారు.

## నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు జూలై 31 వరకు దరఖాస్తులు

**మహబూబాబాద్, జూలై 21 :**

2027–28 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే JNVST-2027 పరీక్షకు జూలై 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మామునూర్ పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. అభ్యర్థుల జనన తేదీ 01-05-2015 నుంచి 31-07-2017 మధ్య ఉండాలి. ప్రవేశ పరీక్ష నవంబర్ 28, 2026న నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, సీబీఎస్ఈ విధానంలో నాణ్యమైన విద్య అందించబడుతుందని పేర్కొన్నారు. అర్హులు www.navodaya.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ

హైదరాబాద్, జూలై 21

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు రాజకీయ ఉనికి కోసం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఎల్ నినో ప్రకృతి విపత్తుపై కేంద్రం నుంచి తెలంగాణకు ప్రత్యేక నిధులు తీసుకురావాలని ఆయన బీజేపీని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో క్యూర్ చట్టంపై సమగ్ర చర్చ జరిపిన తర్వాతే నిర్ణయం తీసుకుం టుందని, బీజేపీ తన అభిప్రాయాలను సభలో వెల్లడించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుందని, ప్రతిపక్షాల గొంతు నొక్కే సంస్కృతి తమది కాదన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమంపై బీజేపీ తన వైఖరిని స్పష్టం చేయాలని, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణకు అదనపు నిధులు సాధించాలని మంత్రి సవాల్ విసిరారు. తెలంగాణకు వచ్చే నిధులు కేంద్రం దయాదాక్షిణ్యంతో కాకుండా రాష్ట్ర ప్రజలు చెల్లించే పన్నుల్లో వాటాగా లభించే హక్కు అని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రధాన కార్యదర్శిని కలిసిన అమెరికా హైదరాబాద్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్

హైదరాబాద్, జూలై 21



అమెరికా హైదరాబాద్ కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ మంగళవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐఏఎస్ ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరస్పర సహకారం, ద్వైపాక్షిక సంబంధాలు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు సమాచారం.

## ఎల్ నినో సవాళ్లపై తెలంగాణ ప్రభుత్వానికి ముందస్తు కార్యాచరణ

హైదరాబాద్, జూలై 21 :

ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రతికూల ప్రభావం పడకుండా తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రవీంద్రభారతిలో ప్లానింగ్ శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. భూమధ్యరేఖ పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతల మార్పుల ప్రభావాన్ని శాస్త్రీయంగా విశ్లేషించి గ్రామీణ స్థాయి వరకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ రంగంలో పగటి పూట అందుబాటులో ఉండే సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచి, థర్మల్ విద్యుత్‌ను సమర్థంగా నిర్వహించడం ద్వారా గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతున్నామని పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాకాలంలోనూ విద్యుత్ డిమాండ్ వేసవి గరిష్ఠ స్థాయికి చేరుకుందని తెలిపారు. ఇలాంటి అవగాహన సదస్సులను జిల్లా వారీగా కూడా నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచాలని అధికారులకు భట్టి విక్రమార్క ఆదేశించారు. కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ ఉప్పల్, ఐఏఎస్ అధికారులు దివ్య దేవరాజన్, గోపి, జితేష్ వి. పాటిల్, ప్లానింగ్ డైరెక్టర్ రూపస్ దత్తం తదితరులు పాల్గొన్నారు.

## హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనులపై సీఎం అసంతృప్తి

హైదరాబాద్, జూలై 21

హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లోని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించి, పనులు నిదానంగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రతి ప్రాజెక్టు పురోగతిపై నెలవారీ నివేదికలు అందించాలని సూచించిన సీఎం, అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సస్పెన్షన్‌కు కూడా వెనకాడవద్దని హెచ్చరించారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, వచ్చే వారంలోగా లబ్ధిదారులకు ప్లాట్ల పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

## ట్రెసా నూతన కార్యవర్గానికి కలెక్టర్ రాజర్షి షా అభినందనలు



అదిలాబాద్ జూలై 21

జిల్లా కలెక్టర్ రాజర్షి షాను తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ట్రెసా) నూతన కార్యవర్గం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల జరిగిన ట్రెసా ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షులు ఎల్. రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి బి. కార్తిక్ నేతృత్వంలోని సభ్యులు కలెక్టర్‌ను పుష్పగుచ్ఛం, మొక్కలు

# బీసీలకు అడుగడుగునా అన్యాయమే: కళ్లెం కృష్ణ

- ఆలేరులో బీసీ హక్కుల సాధన సమితి మండల ద్వితీయ మహాసభ: నూతన కమిటీ ఎన్నిక

ఆలేరు, జూలై 21 :



బీసీలకు స్వాతంత్ర్యానికి ముందు తరువాత కూడా అన్ని రంగాల్లో అన్యాయం కొనసాగుతోందని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కళ్లెం కృష్ణ అన్నారు. ఆలేరులోని ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్‌లో బీసీ హక్కుల సాధన సమితి ఆలేరు మండల ద్వితీయ మహాసభను మండల అధ్యక్షుడు పోతు ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన కళ్లెం కృష్ణ మాట్లాడుతూ బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన ప్రాధాన్యం ఇప్పటికీ దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కృషి ఫలితంగా ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు లభించాయని, అనంతరం ఉప ప్రణాళికలు, రక్షణ చట్టాలు అమల్లోకి వచ్చాయని గుర్తు చేశారు. దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు మాత్రం విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు మినహా రాజకీయ రిజర్వేషన్లు, ప్రత్యేక రక్షణ చట్టాలు, ఉప ప్రణాళిక వంటి సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. మండల్ కమిషన్ సిఫార్సుల మేరకు పరిమిత స్థాయిలో మాత్రమే రిజర్వేషన్లు అమలు చేశారని, కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించినప్పటికీ బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌ను పట్టించుకోలేదన్నారు. బీసీల హక్కుల సాధన కోసం చట్టసభల్లో రిజర్వేషన్లు, బడ్జెట్‌లో ప్రత్యేక నిధుల కేటాయింపు, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగింపు వంటి అంశాల సాధనకు బీసీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో డైరెక్టర్ చెక్క వెంకటేష్, సీపీఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, బీసీ సంఘాల నాయకులు చింతకింది రామానుజం, మాటూరు జానమ్మ, గొట్టిపాముల శ్రీనివాస రాజు, పేరపు రాములు, చౌడబోయిన పరుశురాములు, పుణ్యబోయిన రవి, బర్ల ప్రశాంత్, ఆలేటి పూలమ్మ, అందాలు, కర్రె సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభ అనంతరం బీసీ హక్కుల సాధన సమితి ఆలేరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చింతకింది రామానుజం, అధ్యక్షుడిగా పోతు ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా కొరుటూరి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా గొట్టిపాముల శ్రీనివాసరాజు, సహాయ కార్యదర్శిగా చౌడబోయిన పరుశురాములు, కోశాధికారిగా యాట ఉపేందర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు బీసీల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని సభలో నిర్ణయించారు.

# ఉద్యమ జర్నలిస్టులకు ఇండ్లు, ఆరోగ్య భద్రత కల్పించాలి

హైదరాబాద్, జూలై 21 :



తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులకు శాశ్వత నివాసం, ఆరోగ్య భద్రత కల్పించాలని తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక కన్వీనర్ భారత సుదర్శన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావుకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులు ఉద్యోగాలు కోల్పోయి, అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమ జర్నలిస్టులకు తగిన గుర్తింపు, ఉపాధి అవకాశాలు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ఉద్యమ జర్నలిస్టులకు తొలి ప్రాధాన్యంతో ఇండ్ల స్థలాలు, శాశ్వత ఆరోగ్య భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో వేదిక నాయకులు లక్ష్మయ్య నేత, కాసాని శ్రీనివాసరావు, బాయికాడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాపకులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి

హైదరాబాద్, జూలై 21 :



డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో తెలంగాణ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల కోసం "మైక్రో క్రెడెన్షియల్ డెవలప్‌మెంట్" అంశంపై వారం రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (FDP) ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి, అధ్యాపకులు నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు స్వీయ అధ్యయనంతోనే సులభంగా అర్థం చేసుకునేలా కోర్సు మెటీరియల్ రూపొందించాలని తెలిపారు. మైక్రో క్రెడెన్షియల్స్ ద్వారా విద్యార్థులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోగలరని పేర్కొన్నారు. అధ్యాపకుల అభివృద్ధి కోసం ఆధునిక ఐసీటీ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో COEL డైరెక్టర్ ప్రొ. జి. పుష్ప చక్రపాణి త్వరలో పాఠశాల ఉపాధ్యాయులకు కృత్రిమ మేధ (AI)పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలోని పలు డిగ్రీ కళాశాలల అధ్యాపకులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

# నీట్ అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

- ఆలేరులో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన

ఆలేరు, జూలై 21 :



నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి బేషరతుగా రాజీనామా చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాచకొండ జనార్దన్ డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఆలేరులో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లజెండాలు, ఎర్రజెండాలతో రైల్వే గేట్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. జనార్దన్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన తీవ్రమైన ఘటన అని అన్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ నైతిక బాధ్యత వహించాలని, విద్యార్థుల నమ్మకాన్ని దెబ్బతీసిన ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 20న ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన చేపట్టిన విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, అరెస్టులకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరైన విధానం కాదని అన్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఎంతో కష్టపడి, భారీ మొత్తాలు వెచ్చించి పరీక్షలకు సిద్ధమవుతుంటే ప్రశ్నపత్రాల లీకేజీ వంటి ఘటనలు వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శక పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు రాచకొండ సీత, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ సుగుణ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు మాలోత్ మోతీలాల్, అరుణోదయ జిల్లా నాయకుడు ఇక్కిరి శ్రీనివాస్, ఇక్కిరి బీరయ్య, వంగాల నర్సింహారెడ్డి, నమిలే స్వామి, దార యాదగిరి, చింతకింది సత్య నారాయణ, మేకల వెంకటేష్, అక్కపాక యాదగిరి, దొంతెన లక్ష్మీనర్సమ్మ, కొమ్మిడి లత, అందాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా, సామాజిక ఉద్యమాలకు అంకితమైన నాయకుడు వడ్డేమాను శ్రీనివాసులు

- ఆలేరులో సీపీఎం నాయకుడు వడ్డేమాను శ్రీనివాసులు నాలుగో వర్ధంతి సభ

ఆలేరు, జూలై 21 :



ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికులు, కర్షకులు, పేదల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడు వడ్డేమాను శ్రీనివాసులు అని సీపీఎం జిల్లా నాయకుడు ఎంఏ ఇక్బాల్ అన్నారు. మంగళవారం ఆలేరులోని సీపీఎం కార్యాలయంలో దివంగత సీనియర్ నాయకుడు వడ్డేమాను శ్రీనివాసులు నాలుగో వర్ధంతి సభను మొరిగాడి రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏ ఇక్బాల్ మాట్లాడుతూ వడ్డేమాను శ్రీనివాసులు ఎప్పుడూ ఎర్రజెండా నీడలో ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచారని చెప్పారు. కార్మికులు, కర్షకులు, నిరుపేదల సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడటమే కాకుండా, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఈ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు, పేదల గృహ హక్కుల కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, ప్రజల తరఫున ఎన్నో పోరాటాలు నిర్వహించారని తెలిపారు. అలాగే రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి బలమైన సంఘాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని, రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగి రజక వృత్తిదారుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతూ, కార్మికులు, కర్షకులు, శ్రమజీవులను ఐక్యం చేసే లక్ష్యంతో పనిచేయడమే వడ్డేమాను శ్రీనివాసులుకు నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొరిగాడి చంద్రశేఖర్, సీపీఎం మండల నాయకులు నల్లమాస తులసయ్య, వడ్డేమాను బాలరాజు, పిక్క గణేష్, ఘనగాని మల్లేష్, బొప్పిడి యాదగిరి, మొరిగాడి అజయ్, మిట్ట శంకరయ్య, ఎండీ ఖలీల్, కలకం సుదర్శన్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు వడ్డేమాను విప్లవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కాసుల నరేష్, కుమారస్వామి, సంపత్ కుమార్, బర్ల సిద్ధులు, ఘనగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# రేషన్ కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

- ఎమ్మార్వో ఆంజనేయులు
- ఆలేరులో రేషన్ డీలర్ల సమావేశం: పెండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం



**ఆలేరు, జూలై 21 :**

రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్న ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ (e-KYC) పూర్తి చేసుకోవాలని మండల తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో డీలర్లకు అయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి రేషన్ డీలర్ తమ పరిధిలోని రేషన్ కార్డుదారుల ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న వివరాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డులో సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరూ సమీపంలోని చౌక ధరల దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ ధృవీకరణతో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ పూర్తి చేయని సభ్యులకు భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే సేవల విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు.

రేషన్ డీలర్లు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, ప్రతి అర్హులైన సభ్యుడి ఈ-కేవైసీని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు దూడల రోశయ్య, జిల్లా కార్యదర్శి సీత సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుజ్జ అశోక్, మండల ప్రధాన కార్యదర్శి గ్యార ఎల్లయ్య, సీనియర్ డీలర్లు సముద్రాల బిక్షపతి, వంగరి శివకుమార్, కట్ట రామ్‌రెడ్డి, నమిలే నర్సింగరావు, కందుల శ్రీకాంత్, చౌడబోయిన దశరథ, గంధమల్ల ఐలయ్య, మామిడల నర్సింహులు, శరత్, ఈరాసరపు వెంకటేష్, విక్టోరియా, రమ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి:

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**రంగారెడ్డి, జూలై 21 :**

ఎల్-నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎల్-నినో ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి కంటింజెన్సీ ప్లాన్‌లను అమలు చేయాలని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించి అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వరికి బదులుగా పెసర, కంది, జొన్న, రాగులు వంటి తక్కువ నీటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు.

తాగునీటి సరఫరా, పశుగ్రాసం, ఉపాధి హామీ పనులు, నిరంతర విద్యుత్, వైద్య సేవల్లో ఎలాంటి లోటు లేకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త బోర్లు తవ్వించి తాగునీటి బోర్లకు నిరంతర విద్యుత్ అందించాలని అధికారులకు సూచించారు. ప్రకృతి వైపరీత్యాలను అరికట్టలేకపోయినా ముందస్తు ప్రణాళికలతో వాటి ప్రభావాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.




సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రత్యేక అధికారులు సవ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. వివిధ శాఖలు తమ యాక్షన్ ప్లాన్‌లను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, అనంతరం తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు.

# తెలంగాణ అసెంబ్లీని సందర్శించిన మిజోరాం స్పీకర్



**హైదరాబాద్, జూలై 21**

మిజోరాం రాష్ట్ర శాసనసభ స్పీకర్ పూ లాల్ బిక్జామా, ఆయన సతీమణి వాన్ లాల్ రుటి తెలంగాణ రాష్ట్ర శాసనసభను సందర్శించారు. వారికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఇరు రాష్ట్రాల శాసనసభల సమావేశాల నిర్వహణ, పనితీరు, విధానాలపై చర్చించారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రసాద్ కుమార్ వివరించారు. అనంతరం తెలంగాణ శాసనసభ తరఫున మిజోరాం స్పీకర్ దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీసు శాఖ భవిష్యత్ కార్యాచరణపై డీజీపీ సమీక్ష

**హైదరాబాద్, జూలై 21:**

తెలంగాణ పోలీసు శాఖను మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దే దిశగా చేపట్టాల్సిన కీలక అంశాలపై డీజీపీ సి.వి. ఆనంద్ అధ్యక్షతన స్టాఫ్ ఆఫీసర్ల సమావేశం జరిగింది. ఎస్ఆర్‌సీ నివేదిక అమలు, మావోయిస్టు ముప్పు పేరుతో అవసరానికి మించి కల్పించిన భద్రతను ఉపసంహరించి సుమారు 400 మంది పోలీసు సిబ్బంది, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలను సమర్థంగా వినియోగంలోకి తీసుకురావడం, సిబ్బంది–వాహనాల ఆడిట్ అంశాలపై సమీక్షించారు.

అలాగే గ్రేహౌండ్స్, ఆక్టోపస్ యూనిట్లను ఒకే క్యాంపస్ నుంచి నిర్వహించడం, తెలంగాణ పోలీసు మాన్యువల్‌కు తుది రూపు ఇవ్వడం, ఐపీఎస్ అధికారుల యూనిఫాంలో క్రాస్‌బెల్ట్‌లు, లాఠీల వంటి సంప్రదాయ అంశాల ప్రస్తుత అవసరంపై చర్చించారు.

టీజీఎస్‌పీ సిబ్బంది సమస్యల పరిష్కారం, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధం, డ్రగ్ కంట్రోల్ రంగాల్లో కొత్త ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల ఏర్పాటు, ట్రాఫిక్ & రోడ్డు భద్రత బ్యూరో ఏర్పాటుతో పాటు టెక్నాలజీ, కంప్యూటర్ సర్వీసెస్ విభాగం ఆధునీకరణ, సీసీటీఎన్ఎస్ 3.0, టీజీ-కాప్ 3.0, హాక్‌ఐ 3.0 ప్రాజెక్టుల పురోగతిని డీజీపీ సమీక్షించారు. అధికారులు చేసిన సూచనలను పరిశీలించి తెలంగాణ పోలీసు శాఖ భవిష్యత్ విధానాల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటామని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు.



# దేవాదుల పంపులు ఇక 24 గంటలు.. ఈ రాత్రి నుంచే 9 పంపింగ్ యూనిట్లు పూర్తి సామర్థ్యంతో

**హైదరాబాద్, జూలై 21 :**

దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ఈ రాత్రి నుంచే తొమ్మిది పంపింగ్ యూనిట్లు 24 గంటల పాటు నిరంతరం పనిచేస్తాయని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి నుంచి గరిష్ట స్థాయిలో నీటిని ఎత్తిపోసి తొమ్మిది జిల్లాల్లోని 22 రిజర్వాయర్లను నింపేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు దేవాదులపై విమర్శలు చేయడం మానేసి, కాళేశ్వరం ప్రాజెక్టులో తీసుకున్న ఇంజినీరింగ్ నిర్ణయాలు, మేడిగడ్డ పునాది రూపకల్పనలో చేసిన మార్పులు, అలాగే కే. కవిత చేసిన రూ.1,400 కోట్ల కాంట్రాక్టర్ల చెల్లింపుల ఆరోపణలపై సమాధానం చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. దేవాదుల ప్రాజెక్టును మిషన్ మోడ్‌లో పూర్తి చేసి 2027 డిసెంబర్ నాటికి 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు ఉత్తర తెలంగాణలో తాగునీటి భద్రతను మరింత బలోపేతం చేస్తామని మంత్రి తెలిపారు.



## ఎల్‌నినో ప్రభావం.. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పెంచాలి

**హైదరాబాద్, జూలై 21**

ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో గరిష్ట స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అన్ని థర్మల్ కేంద్రాలకు నాణ్యమైన బొగ్గు నిరంతరాయంగా అందేలా సింగరేణి గనులను త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. యాదాద్రి థర్మల్ ప్రాజెక్టు పనులు ప్రజా ప్రభుత్వం వచ్చాక వేగం పుంజుకున్నాయని, ప్రస్తుతం జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,180 మెగావాట్లకు చేరిందన్నారు. బొగ్గు సరఫరా మెరుగుపరిచి రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో జెన్‌కో వాటాను 40 శాతానికి పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.

## ఉద్యమకారులకు న్యాయం చేయడంలో ఆలస్యం చేయొద్దు: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, జూలై 21**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కాలయాపన చేయకుండా నిర్ణీత గడువులో ఉద్యమకారులను గుర్తించి ప్రయోజనాలు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కోరారు. స్వతంత్రత సైనిక్ సమ్మాన్ యోజన, హైదరాబాద్ లిబరేషన్ మూవ్‌మెంట్ విధానాలను అధ్యయనం చేసి తెలంగాణ ఉద్యమకారులకు కూడా అదే తరహా ప్రయోజనాలు కల్పించాలని సూచించారు. 1969 ఉద్యమకారులు, జైలు శిక్ష అనుభవించినవారు, ఎఫ్ఐఆర్‌లు, ఛార్జిషీట్లు ఎదుర్కొన్నవారు, పోలీసు దౌర్జన్యాలు, ఆస్తి నష్టం, ఉద్యోగ నష్టం పొందినవారిని ప్రాధాన్యంతో గుర్తించాలని అన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక వెసులుబాట్లు కల్పించాలని సూచించారు. జార్ఖండ్ తరహాలో గుర్తింపు కార్డులు, పిల్లలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, శాశ్వత కమిటీ ఏర్పాటు అంశాలను పరిశీలించాలని కోరారు. ఉద్యమకారులు మరణిస్తే వారి కుటుంబాలకు ప్రయోజనాలు అందేలా నిబంధనలు రూపొందించాలని చెప్పారు. "కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అన్న భావన ఉంది. అది తప్పని నిరూపించాలి. ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఇక ఆలస్యం చేయవద్దు" అని కవిత పేర్కొన్నారు.

## ఇల్లందు–బొమ్మనపల్లి మార్గంలో ట్రాఫిక్ డైవర్షన్ ఎత్తివేత

**కొత్తగూడెం, జూలై 21 :**



ఇల్లందు క్రాస్–బొమ్మనపల్లి క్రాస్ మధ్య లోతువాగు వద్ద జాతీయ రహదారి (ఎన్‌హెచ్-930పీ) ఓవర్ బ్రిడ్జి మరమ్మత్తు పనులు పూర్తికావడంతో అమల్లో ఉన్న ట్రాఫిక్ డైవర్షన్‌ను జూలై 22 ఉదయం 8 గంటల నుంచి ఎత్తివేస్తున్నట్లు డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. వాహనాలు యథావిధిగా ఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రయాణించవచ్చని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ పోలీసుల సూచనలు అనుసరించాలని కోరారు. మరమ్మత్తు పనులను సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేసిన సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.

## ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షా లు కురవాలి: తలసాని





**హైదరాబాద్, జూలై 21 :**

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి, శ్రీf రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో విస్తారంగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రార్థించారు. బల్కంపేట శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో మంగళవారం పాల్గొన్న ఆయనకు దేవాదాయ శాఖ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ, 2014 వరకు అమ్మవారి కళ్యాణాన్ని ఆలయం లోపలే నిర్వహించేవారని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ఆలయం ముందు భారీ షెడ్డు నిర్మించి లక్షలాది మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేలా కళ్యాణాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కళ్యాణోత్సవానికి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఎల్లమ్మ తల్లి చల్లని దీవెనలతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు.

## 'జెమ్స్ ఆఫ్ ఇండియా' ఛాలెంజ్‌కు శ్రీకారం

**న్యూఢిల్లీ, జూలై 21**

గ్రామీణ స్థాయి డిజిటల్ కంటెంట్ సృష్టికర్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 'జెమ్స్ ఆఫ్ ఇండియా' ఛాలెంజ్ పైలట్ దశను ప్రారంభించింది. జిల్లాల సంస్కృతి, వారసత్వం, పర్యాటకం, చరిత్ర, సంప్రదాయాలను ప్రతిబింబించే 1 నుంచి 3 నిమిషాల వీడియోలను ఆగస్టు 1 నుంచి 31 వరకు MyWAVES (WAVES OTT) వేదికలో అప్లోడ్ చేసి పాల్గొనవచ్చని తెలిపింది. పైలట్ దశలో అండమాన్-నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ-దమన్ దీవ్, గోవా, లడఖ్ ప్రాంతాల్లో కార్యక్రమం అమలు కానుంది. ఉత్తమ కంటెంట్ సృష్టికర్తలకు జిల్లా స్థాయిలో రూ.50 వేల చొప్పున, రాష్ట్ర స్థాయిలో రూ.2 లక్షలు, జాతీయ స్థాయిలో రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నారు. పైలట్ అనంతరం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## SIR ప్రక్రియ వేగవంతం చేయాలి: మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి, జూలై 21:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆందోల్ నియోజకవర్గంలోని బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. బీఎల్ఏలు బూత్‌ల వారీగా రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకుని, నమోదు కాని ఓటర్లను గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలు పూరించడంలో సహాయం అందించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని, గడువులోగా ఫారాలను పూర్తి చేసి డిజిటలైజేషన్ కోసం బీఎల్ఓలకు అందజేయాలని మంత్రి ఆదేశించారు. ఓటర్లలో అవగాహన కల్పించి 100 శాతం నమోదు లక్ష్యాన్ని సాధించాలని ఆయన కోరారు.

## కేంద్ర నిధుల సమీకరణపై కార్యాచరణ రూపొందించాలి: సీఎస్ సంజయ్ జాజు



**హైదరాబాద్, జూలై 21:**

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల సమీకరణకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. వినియోగ ధ్రువపత్రాలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్లు), నివేదికలు, ప్రతిపాదనలను సకాలంలో కేంద్రానికి పంపి నిధుల విడుదల వేగవంతం చేయాలని సూచించారు. శాఖల సమన్వయం, ఆర్థిక వనరుల సమీకరణ, కేంద్ర–రాష్ట్ర పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించిన ఆయన, అన్ని శాఖల పథకాల పురోగతిని సీఎం డ్యాష్‌బోర్డులో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే రానున్న అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలకు అవసరమైన సమాచారాన్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## 2027 జూన్ వరకు తాగునీటికి ఎలాంటి కొరత లేదు: మిషన్ భగీరథ

**రాజన్న సిరిసిల్ల, జూలై 21**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరాకు 2027 జూన్ వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ముఖ్య ఇంజనీర్ సిహెచ్. అమరేంద్ర తెలిపారు. జిల్లాలోని 11 మండలాలు, 262 ఆవాసాలు, రెండు మున్సిపాలిటీలకు అగ్రహారం వద్ద ఉన్న 120 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం ద్వారా మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి రోజుకు సుమారు 108 ఎంఎల్‌డీ ముడి నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మిడ్ మానేరు రిజర్వాయర్‌లో 7.434 టీఎంసీల నీటి నిల్వ ఉందని, దీంతో వచ్చే ఏడాది జూన్ వరకు తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే ఇల్లంతకుంట మండలంలోని 49 గ్రామాలకు లోయర్ మానేరు డ్యామ్ నుంచి 125 ఎంఎల్‌డీ శుద్ధి కేంద్రం ద్వారా తాగునీరు అందిస్తున్నామని, ఎల్ఎండీలో ప్రస్తుతం 5.517 టీఎంసీల నీటి నిల్వ ఉండటంతో ఆయా గ్రామాలకు కూడా 2027 జూన్ వరకు ఎలాంటి నీటి కొరత ఉండదని వెల్లడించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని నిరంతరాయంగా అందించేందుకు మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం: కలెక్టర్



**జగిత్యాల, జూలై 21**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మల్లాపూర్ మండలం సాతారం జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించిన ఆయన, పాఠశాలకు అవసరమైన 39 తరగతి గదుల్లో ప్రస్తుతం 16 మాత్రమే ఉన్నాయని, మరో 23 గదుల నిర్మాణానికి సుమారు రూ.12 కోట్లతో ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.

**సిపిఎం డిమాండ్.**

**వలిగొండ జూలై 21**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో నీటి పరీక్ష పేపర్ల లీకేజీ పై బాధ్యత వహిస్తూకేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న ఢిల్లీ జంతర్మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పాశవీకంగా దాడి చేస్తూ బాష్పవాయు గోళాలు, రబ్బర్ బుల్లెట్లు, ప్రయోగిస్తూ దాడి చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా వలిగొండ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ నీటి పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికీ 19 సార్లు పరీక్ష పత్రాలు లీకయాయని దీన్ని బట్టి చూస్తే కేంద్ర బిజెపి ప్రభుత్వం విద్యారంగం పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని అర్థం చేసుకోవచ్చన్నారు. నీట్ పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారంలో మనస్థాపంతో 19 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని విద్యార్థి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నుండి ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నీటి కుంభకోణంపై సమగ్రమైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి ఉద్యమకారులపై బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, రబ్బర్ బుల్లెట్లు ఉపయోగించడం కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు చర్యలను అర్థం చేసుకోవచ్చని ఇప్పటికైనా వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, మండల కమిటీ సభ్యులు కొండె క్రిష్టయ్య,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు శీలం ఇందిర,కర్నాటి మత్స్యారాణి, కొండూరు సత్తయ్య వేముల లక్ష్మయ్య,ద్యానబోయిన యాదగిరి, చేగూరి నరసింహ,పెద్దబోయిన భీమరాజు,రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**జిల్లా కలెక్టర్ -చిత్ర మిశ్రా**

**కరీంనగర్ జూలై21**

జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అధికారులను ఆదేశించారు. పోలీసు, రవాణా, ఎన్‌హెచ్ఏఐ శాఖలు సమన్వయంతో రహదారి భద్రతకు కార్యాచరణ రూపొందించి, తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలపై డ్రోన్ నిఘా, ప్రత్యేక హైవే పెట్రోలింగ్ బృందాల ఏర్పాటు, అక్రమ పార్కింగ్ నియంత్రణ, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, హైమాస్ట్ లైట్లు, స్పీడ్ కెమెరాలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు చేపట్టాలని ఆదేశించారు. అలాగే భారీ వాహన డ్రైవర్లకు విశ్రాంతి కేంద్రాలు, ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవల కోసం సమీప ఆసుపత్రుల మ్యాపింగ్ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని పేర్కొన్నారు.



## రెండు వర్గాల ఘర్షణపై ఇరువర్గాలపై కేసులు, బైండ్ ఓవర్

**కొత్తగూడెం, జూలై 21**

కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ ఘటనపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై విచారణ చేపట్టిన అనంతరం ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బైండ్ ఓవర్ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వ్యక్తిగత లేదా వర్గాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు, గొడవలు, దాడులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.



## వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సై యుగంధర్ గౌడ్ జన్మదిన వేడుకలు

**వలిగొండ జులై 21**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ యుగంధర్ గౌడ్ జన్మదిన సందర్భంగా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్సై యుగేంధర్ గౌడ్ జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై యుగేంధర్ గౌడ్ ను జర్నలిస్టు యూనియన్ సభ్యులు శాలువా కప్పి కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షిస్తున్న ఆయన భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బొడిగె సుదర్శన్, సంగిశెట్టి విజయ్ కుమార్, రెబ్బ కుమారస్వామి, దేశపాక కృష్ణ స్వామి, మార్క భగవంత, వీసం రాజు, తదితరులు పాల్గొన్నారు.




## ఎస్ఐఆర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలి: సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 21**

రాష్ట్రంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR–2026) ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన ఓటర్లను హార్డ్ కాపీల కోసం ఇబ్బంది పెట్టవద్దని, ఆధార్ కార్డు తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. వీవీఐపీ, వీఐపీ ఓటర్ల పేర్లు జాబితాల్లో ఉండేలా చూడాలని, గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించాలని సూచించారు. ఈ వారంలోగా ప్రతి జిల్లాలో 90 శాతం ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని, డిజిటలైజేషన్ వేగవంతం చేసి నో–మ్యాపింగ్ కేసులను పరిష్కరించాలని ఆదేశించారు.






## హైదరాబాద్ మెట్రోను సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్, జూలై 21**

: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్)ను సందర్శించి మెట్రో నిర్వహణ, ఆపరేషన్స్, భద్రతా వ్యవస్థలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు. మెట్రో అధికారులు ప్రయాణికుల సేవలు, నిర్వహణ ప్రమాణాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను వివరించారు. అనంతరం నాగోలు మెట్రో డిపో, ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్, మెయింటెనెన్స్ షెడ్, కోచ్ నిర్వహణ సదుపాయాలను సందర్శించిన జీఎం, మెట్రో నిర్వహణ ప్రమాణాలు, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని ప్రశంసించారు. రైల్వే–మెట్రో సంస్థల పరస్పర సహకారం భవిష్యత్‌లో మరింత బలోపేతమై పట్టణ రవాణా అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే మెట్రో డిపోలో మొక్కలు నాటి హరిత కార్యక్రమాలకు మద్దతు తెలిపారు.

# ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబీసీ మహాసభ

హైదరాబాద్, జూలై 21

దేశవ్యాప్తంగా బీసీలను ఏకతాటిపైకి తీసుకురావడం, బీసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభకు హాజరు కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మహాసభకు ప్రత్యేక అతిథులుగా రావాలని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లను హైదరాబాద్‌లో వారి నివాసాల్లో కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు బెంగళూరులోని సిటీ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆగస్టు 7 ఉదయం 10



గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభకు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, ఎంపీ ఈటల రాజేందర్ హాజరుకానున్నట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాంకుర్మా, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఓటును కాపాడాలి: కొండా మురళి





వరంగల్, జూలై 21 .

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియను మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పరిశీలించారు. అబ్జర్వర్ శంకర్ నాయక్, పార్లమెంట్ ఇన్‌చార్జ్ నసీర్ అహ్మద్‌తో కలిసి 18, 27, 36, 37, 38 డివిజన్లలో బూత్ ఇన్‌చార్జీల పనితీరును సమీక్షించి, ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కొండా మురళి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు ఎన్యుమరేషన్ ఫారం నింపి గడువులోగా సమర్పించాలని, ఓటరు జాబితాలో వివరాలు సక్రమంగా నమోదయ్యేలా బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, దానిని కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. అలాగే, ఓటర్ల జాబితాల విషయంలో బీజేపీ అనుసరిస్తున్న విధానంపై విమర్శలు గుప్పించిన ఆయన, రాజకీయ ప్రయోజనాల కోసం ఓటర్ల జాబితాల్లో మార్పులు చేయాలనే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

# సత్తుపల్లిలో ఉప ముఖ్యమంత్రి భట్టి పర్యటన

- జేవీఆర్ ఓపెన్‌కాస్ట్–2 గనుల పరిశీలన
- బొగ్గు ఉత్పత్తి, గనుల నిర్వహణపై సమీక్ష

, సత్తుపల్లి:

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం సత్తుపల్లి సమీపంలోని సింగరేణి జేవీఆర్ ఓపెన్‌కాస్ట్–2 గనులను సందర్శించనున్నారు. ఈ పర్యటనలో గనుల పనితీరు, బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు జేవీఆర్ ఓపెన్‌కాస్ట్–2 గనులకు చేరుకోనున్న ఉప ముఖ్యమంత్రి, ముందుగా సింగరేణి ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 12.10 గంటల నుంచి 2.30 గంటల వరకు గనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బొగ్గు ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యత ప్రమాణాలు, భద్రతా చర్యలు, యంత్రాల పనితీరు, గనుల నిర్వహణ తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, ఉత్పత్తి పెంపు, భద్రతా ప్రమాణాల అమలు, గనుల సమర్థ నిర్వహణ, కార్మిక సంక్షేమం వంటి అంశాలపై అవసరమైన సూచనలు చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఇంధన రంగ అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు రిజర్వ్ సమయం ఉండగా, మధ్యాహ్నం 3.30 గంటలకు సత్తుపల్లి నుంచి కొత్తగూడెం వైపు రోడ్డు మార్గంలో బయలుదేరనున్నారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్‌కు నిరసనగా తెలంగాణలో మంత్రుల ఆందోళన

హైదరాబాద్, జూలై 21

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఢిల్లీలో నిరసన కార్యక్రమం సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ తెలంగాణలో పలువురు రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీతో పాటు అదుపులోకి తీసుకున్న ఇతర ప్రతిపక్ష నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పిలుపు మేరకు తెలంగాణలో జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు నిరసన

# అనుభవంతో ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలు అందించాలి: ఎస్పీ డాక్టర్ శబరీష్

మహబూబాబాద్, జూలై 21 :

జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ కీలక సూచనలు చేశారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు తమ సీనియారిటీ, అనుభవాన్ని సమర్థవంతమైన కార్యాచరణగా మార్చి ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా, సహనంతో



వ్యవహరించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే పోలీసింగ్ అందించాలని ఆదేశించారు.



# ఉగ్రా నిత్యా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు

వరంగల్, జూలై 21 :



శాకంభరీ నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శ్రీ భద్రకాళి అమ్మవారు ఉగ్రా నిత్యా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాళీ క్రమానుసారం ఉగ్రా నిత్యగా, షోడశీ క్రమానుసారం శివదూతి మాతగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య ఆరాధన కూడా చేపట్టారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలు అందజేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జటోత్ రామచందర్ నాయక్ కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ రోజు సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా భక్తులకు దద్ధ్యోదనం, శనగపిండితో తయారు చేసిన హల్వా ప్రసాదంగా పంపిణీ చేశారు.

# సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రోడ్డు భద్రత చర్యలను పకడ్బందీగా అమలు చేయాలి

,మంచిర్యాల:

సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను సమర్థవంతంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై అనుమతించిన లే–బైలు, వే–సైడ్ సౌకర్య కేంద్రాలు మినహా ఇతర ప్రాంతాలలో భారీ, వాణిజ్య వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి: సుదర్శన్ రెడ్డి




నిజామాబాద్, జూలై 21

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సూచనలు అందించాలని ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి నిర్వహించిన సమీక్షలో తక్కువ నీటి అవసరమయ్యే పంటలు, ఆకు కూరలు, పందిరి కూరగాయలు, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని చెప్పారు. భూసార పరీక్షల ఆధారంగా పంటల ఎంపిక, రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటు కల్పించాలని ఆదేశించారు. అలాగే జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికతో నీటి వనరులను సమర్థంగా వినియోగించాలని అధికారులకు సూచించారు.

# మేఘాలయ లకాడాంగ్ పసుపుకు 'మిషన్ గోల్డెన్ స్పైస్' ప్రారంభం

న్యూఢిల్లీ, జూలై 21

మేఘాలయకు చెందిన జీఐ ట్యాగ్ పొందిన లకాడాంగ్ పసుపును ప్రపంచ ప్రీమియం మసాలా బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర సమాచార, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం. సింధియా ★'మిషన్ గోల్డెన్ స్పైస్'★ను ప్రారంభించారు. రూ.175.45 కోట్ల వ్యయంతో 2025–2030 వరకు ఐదేళ్లపాటు అమలు చేసే ఈ ప్రాజెక్టు ద్వారా పసుపు సాగు విస్తరణ, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎగుమతులు, బ్రాండింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం 2,500 హెక్టార్లలో ఉన్న లకాడాంగ్ పసుపు సాగును 7,500 హెక్టార్లకు విస్తరించి, రైతులకు కిలోకు లభిస్తున్న రూ.30–40 ధరను 2030 నాటికి సుమారు రూ.80కు పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రపంచ సగటుతో పోలిస్తే నాలుగు రెట్లు అధిక కర్క్యుమిన్ (7–10%) కలిగిన ఈ సేంద్రీయ పసుపును అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రీమియం ఉత్పత్తిగా నిలబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చర్యలు చేపట్టనున్నాయి.

# టెన్సింగ్ నార్కే సాహస పురస్కారం-2025కు దరఖాస్తులు ప్రారంభం

న్యూఢిల్లీ, జూలై 21

యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్ఠాత్మక టెన్సింగ్ నార్కే జాతీయ సాహస పురస్కారం–2025 కోసం ఆన్‌లైన్ నామినేషన్లను ఆహ్వానించింది. జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు జాతీయ పురస్కారాల పోర్టల్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. భూమి, జలం, నింగిలో చేసిన సాహస కృత్యాలు, అలాగే జీవితకాల సాహస సేవలకు ఈ పురస్కారం ప్రదానం చేస్తారు. విజేతలకు కాంస్య ప్రతిమ, ప్రశంసాపత్రం, బ్లేజర్ (లేదా చీర), రూ.15 లక్షల నగదు బహుమతి అందజేస్తారు. ఈ పురస్కారం అర్జున అవార్డు స్థాయికి సమానమైనది. అర్హులైన భారతీయ పౌరులు సంబంధిత రాష్ట్ర యువజన/క్రీడాశాఖ లేదా గుర్తింపు పొందిన సాహసిక సంస్థల సిఫారసుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ కు నిరసనగా తెలంగాణలో మంత్రుల ఆందోళన

హైదరాబాద్, జూలై 21

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఢిల్లీలో నిరసన కార్యక్రమం సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ తెలంగాణలో పలువురు రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీతో పాటు అదుపులోకి తీసుకున్న ఇతర ప్రతిపక్ష నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పిలుపు మేరకు తెలంగాణలో జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు.

# తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి: అల్లం నారాయణ



హైదరాబాద్, జూలై 21

తెలంగాణ ఉద్యమంలో కలం, కెమెరాతో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను అధికారికంగా ఉద్యమకారులుగా గుర్తించి, వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు, సంక్షేమ పథకాలు అందించాలని తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) అధ్యక్షుడు అల్లం నారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి ఐదు ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. తెలంగాణ అస్తిత్వ మీడియా సంస్థలను ప్రోత్సహించేందుకు రూ.1,000 కోట్ల ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని, యువ జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, ఉద్యమంలో సేవలందించిన సీనియర్ జర్నలిస్టులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు.

# సంతోషం.. సగం బలం



ఇమ్యూనిటీ అనగానే బెటర్ ఫుడ్, ఎక్సర్‌సైజ్ లాంటివే ముందుగా గుర్తుకొస్తాయి. కానీ ఆనందం, సంతోషం కూడా ఎంతగానో తోడ్పడతాయి. జబ్బుల బారినపడకుండా లైఫ్‌లాంగ్ కాపాడతాయి. కొన్ని అధ్యయనాలు ఈ విషయాన్ని చెబుతున్నాయి. మంచి కబురు విన్నప్పుడో, కలలుగంటున్న ఉద్యోగం లభించినప్పుడో, విజయం సాధించినప్పుడో.. ఇలాంటి సందర్భాల్లో ఎవరికైనా ఆనందం, సంతోషం కలుగుతాయి. ఇంతకీ ఆనందమంటే? దీనికి ఇదమిత్థమైన నిర్వచనమంటూ లేదు. శరీరపరంగా చూస్తే ఆనందమనేది ఓ భావోద్వేగ స్థితి. ఒంట్లో డోపమిన్, సెరటోనిన్ వంటి నాడీ సమాచార వాహికలు విడుదలైనప్పుడు ఇలాంటి స్థితి కలుగుతుంది. అయితే ఇది మనసుకే పరిమితం కాదు. ఆరోగ్యం మీదా సానుకూల ప్రభావం చూపుతుంది. వ్యక్తులు హాయిగా, ఆరోగ్యంగా జీవిస్తుండటానికీ ఆనంద స్థాయులకూ సంబంధం ఉంటున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. సంతోషం లేదా సానుకూల ప్రభావం గుండెజబ్బుల నుంచి కాపాడుతున్నట్టు.. ఆనందంగా ఉన్న రోజుల్లో గుండె కొట్టుకునే తీరు సాఫీగా సాగుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. సానుకూల భావోద్వేగాలకూ రోగనిరోధకశక్తికీ మధ్య సంబంధం గురించి ఇంకా పూర్తిగా అవగతం కాలేదు. కానీ ఆనందంగా ఉండే వారిలో రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉంటున్నట్టు, ఫలితంగా జబ్బులను మరింత సమర్థంగా ఎదుర్కొంటున్నట్టు చాలా అధ్యయనాల్లో వెల్లడైంది.



### ఆరోగ్యంగా ఉంటేనే..

ఆరోగ్యం, ఆనందం పరస్పరం ఆధారితాలు. వీటి మధ్య పరోక్ష సంబంధం ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్నప్పుడు మంచి నిర్ణయాలు తీసుకుంటాం. మంచిగా ప్రవర్తిస్తాం. మంచి ఆహారం తినటం, వ్యాయామం చేయటం, త్వరగా నిద్రకు ఉపక్రమించటం వంటి అలవాట్లన్నీ మూడ్‌ను ఉత్సాహ పరుస్తాయి. మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. అంటే ఆరోగ్యం మంచి ప్రవర్తనకు.. మంచి ప్రవర్తన ఆనందానికీ దోహదం చేస్తాయన్నమాట. నిద్ర సమస్యలతో బాధపడేవారి మీద 2008లో నిర్వహించిన అధ్యయనమూ ఇదే సూచిస్తోంది. వీరిలో దాదాపు సగం మందిలో సానుకూల దృక్పథం తక్కువగా ఉంటున్నట్టు బయటపడింది. కంటి నిండా నిద్రపోవటమనేది మన భావోద్వేగ స్థితి మీద నేరుగా ప్రభావం చూపుతుందనటానికిదో నిదర్శనం.

### అలవాటుగా మార్చుకోండి..

ఆశ్చర్యంగా అనిపించినా ఆనందంగా, సంతోషంగా ఉండటాన్నీ నేర్చుకోవచ్చు. దీన్నొక అలవాటుగానూ మార్చుకోవచ్చు. మనలోని అసలు మనిషిని గుర్తించటం ద్వారా దీన్ని సాధించొచ్చు. సాధారణంగా వయసు పెరుగుతున్నకొద్దీ చాలామంది భావోద్వేగాలను కోల్పోతుంటారు. లోపల దాగున్న పిల్లల మనస్తత్వాన్ని మరచిపోతుంటాం. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవటం, బాధ్యతలను నెరవేర్చటంలో మునిగిపోయి మనల్ని మనుషులుగా మలచే, జీవితానికి విలువను చేకూర్చే చిన్న చిన్న పనులను ఆస్వాదించటంలో విఫలమవుతుంటాం. దీన్ని గుర్తిస్తే చాలావరకు ఆనందంగా ఉండటాన్ని నేర్చుకున్నట్లే.

- మనలోని పిల్లల మనస్తత్వం అలాగే ఉంటుంది. ఎంత పెద్దవాళ్లయినా పిల్లల మాదిరిగా ఆడుకోవాలని, ఆనందించాలని ఎప్పుడో అప్పుడు అనుకోవటమూ సహజం. ఈ నిజాన్ని అంగీకరించాలి. ఒకసారి లోపలి పిల్లాడికి అనుమతించి చూస్తే తేడా ఇట్టే తెలుస్తుంది. జీవితాన్ని ఆస్వాదించటమెలాగో తెలుస్తుంది.
- చాలావరకు మనం ఎవరో నడిచిన దారిలో నడవాలని ప్రయత్నిస్తుంటాం. ఎవరినో చూసి, అలాగే కావాలని పరుగులు పెడుతుంటాం. అందులో పడిపోయి అసలు మనకు కావాల్సిందేంటో మర్చిపోతాం. నిజానికి మనసుకు నచ్చిన పనులతోనే లక్ష్యం త్వరగా అందుతుంది. ఆనందమూ సొంతమవుతుంది.
- కొన్నిసార్లు జీవితంలో అనూహ్య, అవాంఛిత ఘటనలు జరుగుతుంటాయి. కష్టాలు, నష్టాలు ఎదురవుతుంటాయి. వాటినే తలచుకుంటూ ఉంటే విచారం తప్ప మిగిలేదేమీ ఉండదు. ఎంతటి విపత్కర పరిస్థితులైనా ఎల్లకాలం ఉండవని అర్థం చేసుకోవాలి. ప్రతి సవాల్‌నూ అవకాశంగా మలచుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడు ఆనందానికి బాట పడుతుంది.
- తృప్తి పడటమనేది అద్భుతమైన భావన. ఇదొక మానసిక ధోరణి. జీవన మార్గం. చిన్న చిన్న విషయాలకూ తృప్తి పడటం నేర్చుకొని చూడండి. జీవితం కొత్త సొబగులు అద్దుకుంటుంది. మనసూ ఆనందంగా ఉంటుంది.

# వాతావరణ మార్పుతో బ్రెయిన్‌పై ఎఫెక్ట్



వాతావరణ మార్పు బ్రెయిన్‌పై ఎఫెక్ట్ చూపిస్తున్నట్లు ఇటీవల ఓ స్టడీలో తేలింది. దీని మూలంగా పెరాలసిస్, పార్శ్వనొప్పి, అల్జీమర్స్, మూర్ఛ, మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి నాడీ జబ్బులు తీవ్రమయ్యే ప్రమాదముందని హెచ్చరించింది. ముఖ్యంగా పెరాలసిస్, నాడీవ్యవస్థ ఇన్‌ఫెక్షన్ల మీద వాతావరణం ప్రభావం చూపుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. విపరీత ఉష్ణోగ్రతలు.. ఎక్కువ హీట్, ఎక్కువ కూల్, రోజంతా ఉష్ణోగ్రతలో తీవ్రమైన తేడా వంటి వాతావరణ వ్యత్యాసాలతో ఎక్కువ ప్రభావం పడుతోందని వివరిస్తున్నారు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న రోజుల్లో లేదా వడగాలులు వీచిన రోజుల్లో పెరాలసిస్ బారినపడుతున్నవారి సంఖ్య పెరుగుతుండటం గమనార్హం. వడగాలి లేదా అతిచల్లదనం వంటివి మతిమరుపునకు దారితీస్తున్నట్టు తేలింది. వరదలు, కార్చిచ్చులు సైతం దీనికి కారణమవుతున్నాయి. వేడి వాతావరణంలో నీరు ఎక్కువగా తాగటం, గాలి ఆడేలా చూసే దుస్తులు ధరించటం వంటి జాగ్రత్తలతో జబ్బుల ముప్పును తగ్గించుకునే వీలుండటం విశేషం. రాత్రిపూట ఉష్ణోగ్రతలూ కీలకమే. అధిక ఉష్ణోగ్రతలు నిద్రను అస్తవ్యస్తం చేస్తాయి. నిద్రలేమి పలు మెదడు సమస్యలకు దారితీస్తుంది. భూతాపం పెరుగుతున్న నేపథ్యంలో మున్ముందు వాతావరణం మరింతగా మార్పు చెందే అవకాశం ఉండటం వల్ల అధ్యయన ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



## కాఫీ, టీ.. తాగాలా?.. వద్దా?

కాఫీ, టీ మంచిది కాదని చాలామంది చెబుతుంటారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ తాజాగా విడుదల చేసిన రిపోర్ట్‌లో ఏముందో తెలుసుకుందాం. చాయ్ కానీ కాఫీ కానీ అసలే మానేయమనడం లేదు. కాకపోతే భోజన సమయంలో మంచిది కాదు. గంట ముందు లేదా తర్వాత తాగండి. కొందరు ఆహారం తీసుకునేటప్పుడు కాఫీ, టీలు తాగితే త్వరగా అరుగుతుందని, శరీరంలో పేరుకున్న నూనెను కరిగించేస్తుందని అనుకుంటారు. అది నిజం కాదు. అయితే కాఫీలో ఉండే టన్నిన్స్ ఐరన్స్ గ్రహించడంలో తోడ్పడుతుంది. కనుక ఐరన్ లోపం ఏర్పడకుండా ఉంటుంది. ఎనీమియా రాదు. అయితే కాఫీ, టీల్లో కెఫిన్ ఉంటుంది కనుక అది మోతాదు మించిన కొద్దీ మానసిక రుగ్మతలతో సహా అనేక అనారోగ్యాలు వచ్చే అవకాశం ఉంది. పరగడుపున కాఫీ తాగడం చాలామందికి అలవాటు. అది మంచిది కాదు, ఏమైనా తిన్న తర్వాతే తాగాలి. కాఫీ, టీల్లో ఉండే థియోఫిలిన్ రక్త సరఫరా సక్రమంగా ఉండేలా చేస్తుంది. అందువల్ల గుండె జబ్బులు, జీర్ణాశయ క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుంది. అయితే పాలు లేకుండా డికాక్షన్ తాగడం మంచిది. తక్కువ మోతాదులో కాఫీ, టీ తీసుకుంటే ఫరవాలేదు. అంతకంటే ముఖ్యంగా.. తాజా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, మాంసం, చేపలు, రొయ్యలు లాంటి ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండే ప్రయత్నం చేయాలి.



## ఆ మెసేజ్‌లు ఆటోమేటిక్‌గా డిలీట్

వాట్సాప్ తమ యూజర్ల కోసం సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. సాధారణంగా వాట్సాప్ ఓపెన్ చేయగానే ఎన్నో గ్రూప్‌ల నుంచి వచ్చే మెసేజ్‌లు కొన్నిసార్లు చికాకు తెప్పిస్తుంటాయి. ఈ సమస్యను అదిగమించేందుకు వాట్సాప్ కొఒత్త ఫీచర్ అందుబాటులోకి తేనున్నట్లు వీబీటా ఇన్ఫో తెలిపింది. ప్రస్తుతం ఈ ఫీచర్‌ను ఎంపిక చేసిన బీటా వెర్షన్ యూజర్లు వాడుతున్నట్లు వెల్లడించింది. ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే.. లేటెస్ట్‌గా వాట్సాప్‌కు వచ్చే మెసేజ్‌లకు నోటిఫికేషన్ వస్తుంది. చదవని వాట్సాప్ మెసేజ్‌లు వాటంతట అవే డిలీట్ అవుతాయి



# నా భారత జట్టు ఇదే.. వాళ్లకు నో ఛాన్స్!




ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లోనూ టీమిండియాకు భంగపాటే ఎదురైంది. తొలుత టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టు చేతిలో 40 క్లీన్‌స్వీప్ అయిన భారత జట్టు.. ఆ తర్వాత వన్డే సిరీస్‌లో 21తో ఓడిపోయింది. తొలి వన్డేలో గెలిచిన గిల్ సేన.. ఆ తర్వాత రెండు వన్డేల్లోనూ ఓడిపోయింది.

**ఫిట్‌నెస్‌లేని ఆటగాళ్లకు గిల్ వార్నింగ్**

ముఖ్యంగా లార్డ్‌స్‌లో భారత బౌలర్ల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడింది. ఇక జస్‌ప్రీత్ బుమ్రా గాయం వల్ల ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. అంతకుముందే ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా గాయపడి జట్టుకు దూరమయ్యాడు. ఇక ఈ సిరీస్ కంటే ముందే ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి కూడా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో తరచూ గాయపడే ఆటగాళ్ల వల్ల తుదిజట్టు కూర్పు దెబ్బతింటోందని కెప్టెన్ శుబ్‌మన్ గిల్ అన్నాడు. వన్డే వరల్డ్‌కప్2027లో వరుసగా ఏడు మ్యాచ్‌ల దాకా ఆడాల్సి ఉంటుందని.. అలాంటి కీలక సమయంలో వీరితో కష్టమేనంటూ అసంతృప్తి వ్యక్తం చేశాడు. తమ ఫిట్‌నెస్ ప్రమాణాలు మెరుగుపడితేనే అనుకున్న ఫలితాలు రాబట్టగలమని గిల్ గట్టిగానే వార్నింగ్ ఇచ్చాడు. ఇలాంటి తరుణంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మాజీ బ్యాటర్ అభినవ్ ముకుంద్ వరల్డ్‌కప్ జట్టును ఎంచుకున్నాడు.

**వారికే పెద్దపీట**

టాపార్డర్‌లో ఎలాంటి మార్పులు చేయని అభినవ్.. ఓపెనర్లుగా రోహిత్ శర్మ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ జోడీని వన్‌డౌన్‌లో విరాట్ కోహ్లిని కొనసాగించాడు. అయితే బ్యాకప్ ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్‌కు మాత్రం చోటివ్వలేదు. ఇక వికెట్ కీపర్లుగా కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్‌లను ఎంచుకున్న అభినవ్.. మిడిలార్డర్‌లో వీరితో పాటు శ్రేయస్ అయ్యర్‌కు చోటిచ్చాడు. ఆల్‌రౌండర్ల కోటాలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లను ఎంచుకున్న అభినవ్ ముకుంద్.. రవీంద్ర జడేజాను పక్కనపెట్టాడు. స్పెషలిస్టు స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్‌కు స్థానమిచ్చిన అతడు.. వరుణ్ చక్రవర్తికి చోటివ్వలేదు. ఇక పేస్ విభాగంలో ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ, హర్షిత్ రాణా, గుర్నూర్ బ్రార్‌లకు చోటు ఇచ్చాడు. ప్రిన్స్ యాదవ్, మహ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్ పేర్లను అభినవ్ ముకుంద్ పరిగణనలోకి తీసుకోలేదు.

**వీళ్లు కూడా ఉండవచ్చు**

అయితే, వరల్డ్‌కప్ టోర్నీకి ఇంకా సమయం ఉంది కాబట్టి.. నితీశ్ కుమార్ రెడ్డి, శివం దూబే, రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్, అర్ష్‌దీప్ సింగ్ ఆఖరి నిమిషంలో జట్టులోకి వచ్చినా అభినవ్ ఆశ్చర్యం లేదన్నాడు. కాగా వచ్చే ఏడాది సౌతాఫ్రికా జింబాబ్వే నమీబియా వేదికలుగా అక్టోబరు నవంబరు మధ్య వన్డే వరల్డ్‌కప్ జరుగనుంది.

**వన్డే వరల్డ్‌కప్-2027 టోర్నీకి అభినవ్ ముకుంద్ ఎంచుకున్న భారత జట్టు**

రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, ప్రసిద్ కృష్ణ, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్.



# వైభవ్ 'తరానికి ఒక్కడు'.. కాపాడుకోండి: సికందర్ రజా

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన అరంగేట్ర సిరీస్‌లో నిరాశపరిచిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో వైభవ్ కేవలం 42 పరుగులు మాత్రమే చేశాడు. అయితే 15 ఏళ్ల వైభవ్‌కు అంతర్జాతీయ వేదికపై తన టాలెంట్‌ను నిరూపించుకోవడానికి మరో అవకాశం ఇప్పుడు లభించింది. జింబాబ్వేతో జరగనున్న మూడు టీ20ల సిరీస్‌లో భారత ఇన్నింగ్స్‌ను వైభవ్ ప్రారంభించనున్నాడు. ఈ నేపథ్యంలో సూర్యవంశీపై జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ప్రశంసల వర్షం కురిపించాడు. అతడు ప్రపంచ క్రికెట్‌లో గొప్ప స్టార్‌గా ఎదుగుతాడని రజా కొనియాడాడు. "వైభవ్ సూర్యవంశీ ఒక అద్భుతమైన క్రికెటర్. కేవలం 15 ఏళ్ల వయస్సులో ప్రపంచస్థాయి బౌలర్లను అతడు ఎదుర్కొన్న తీరు అమోఘం. అయితే అంతర్జాతీయ స్థాయిలో ఆడేటప్పుడు సహజంగా ఆటగాళ్లపై ఒత్తిడి ఉంటుంది. కాబట్టి కేవలం రెండు లేదా మూడు మ్యాచ్‌లలో విఫలమైనంత మాత్రాన వైభవ్‌ను విమర్శించడం సరికాదు. ఎంతో మంది గొప్ప క్రికెటర్లతో వైభవ్ డ్రెసింగ్ రూమ్‌ను షేర్ చేసుకుంటున్నాడు. వారి నుంచి చాలా విషయాలు నేర్చుకుంటున్నాడు. బీసీసీఐ వైభవ్‌ను సరైన దిశలో నడిపిస్తే, అతడు ఖచ్చితంగా ఈ తరంలో గొప్ప క్రికెటర్ అవుతాడని" రజా హాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. కాగా జూలై 23న హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జింబాబ్వేభారత్ మధ్య తొలి టీ20 జరగనుంది. వరుసగా మూడు సిరీస్‌లు కోల్పోయిన టీమిండియా.. తిరిగి జింబాబ్వే పర్యటనలో పుంజుకోవాలని పట్టుదలతో ఉంది.

# శ్రీలంక బ్యాటర్లకు చుక్కలు చూపించిన భారత బౌలర్లు

శ్రీలంక అండర్19 బ్యాటర్లకు భారత యువ బౌలర్లు చుక్కలు చూపించారు. అద్భుతమైన ప్రదర్శనతో ఆతిథ్య జట్టును ముప్పుతిప్పలు పెట్టారు. కాగా శ్రీలంక భారత్ అండర్19 జట్ల మధ్య సోమవారం రెండో అనధికారిక టెస్టు మొదలైంది.



**భారత్ భారీ స్కోరు**

కొలంబో వేదికగా టాస్ ఓడిన భారత్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. తొలిరోజు మూడు వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసిన భారత జట్టు.. 253/3 ఓవర్‌నైట్ స్కోరుతో మంగళవారం నాటి రెండో రోజు ఆట మొదలుపెట్టింది. ఈ క్రమంలో తొలి ఇన్నింగ్స్‌లో 105.2 ఓవర్లలో 411 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌట్ అయింది. వన్‌డౌన్ బ్యాటర్ కుశాగ్ర ఓజా (193 బంతుల్లో 111), ఆల్‌రౌండర్ మనాల్ చౌహాన్ (244 బంతుల్లో 150) సెంచరీలు.. యశ్‌వర్ధన్ చౌహాన్ (89 బంతుల్లో 78) అర్ధ శతకంతో రాణించారు. శ్రీలంక బౌలర్లలో గిమ్హాన్ మెండిస్ మూడు వికెట్లు తీయగా.. సెత్మిక సెనెవిరత్నె, దుల్నిత్ సిగెర, విఘ్నేశ్వరన్ ఆకాశ్ తలా రెండు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. ఈ క్రమంలో తమ తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన శ్రీలంకకు భారత బౌలర్లు ఆది నుంచే షాకులు ఇచ్చారు.

**శ్రీలంక బ్యాటర్లకు చుక్కలు**

ఓపెనర్లలో అవీష సమాష్ (9)ను ప్రణవ్ రాఘవేంద్ర పెవిలియన్‌కు పంపగా.. దిమంత మహావితన (24)ను కావ్యా పటేల్ అవుట్ చేశాడు. గత మ్యాచ్‌లో డబుల్ సెంచరీతో చెలరేగిన వన్‌డౌన్ బ్యాటర్ సెనుజ వెకునగొడను ఈసారి భారత్ ఐదు పరుగులకే పరిమితం చేసింది. చిగురుపాటి వెంకట బౌలింగ్‌లో సెనుజ లక్ష్య రాయ్‌చందానికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత భారత బౌలర్లు జోరు కొనసాగించడంతో కెప్టెన్ విమత్ దిన్సార 8, కవిజ గమాగే 7, వికెట్ కీపర్ బ్యాటర్ జేసన్ ఫెర్నాండో 0 పరుగులకే పెవిలియన్ చేరారు. విరాన్ చముదిత 21, దుల్నిత్ సిగెర 31 పరుగులతో ఫర్వాలేదనిపించారు. ఈ క్రమంలో మంగళవారం నాటి ఆట ముగిసే సరికి శ్రీలంక 40 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 122 పరుగులు మాత్రమే చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ కంటే ఇంకా 289 పరుగులు వెనుకబడి ఉంది. భారత బౌలర్లలో ప్రణవ్ రాఘవేంద్ర, చిగురుపాటి వెంకట, రోహిత్ యాదవ్ తలా రెండు వికెట్లు తీయగా.. కావ్యా పటేల్, జగన్నాథ్ హెంచుదేశన్ చెరో వికెట్ దక్కించుకున్నారు. కాగా భారత్ శ్రీలంక మధ్య తొలి అనధికారిక టెస్టు డ్రా అయింది.

# హాకీ వరల్డ్ కప్.. జట్టును ప్రకటించిన భారత్



ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనున్న పురుషుల హాకీ ప్రపంచ కప్ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నమెంట్ కోసం మంగళవారం 20 మంది సభ్యులతో భారత్ జట్టును ప్రకటించింది. డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ఇటీవల లండన్ అంచె ప్రొ హాకీ లీగ్‌లో భారత్ 24 మంది ఆటగాళ్లతో బరిలోకి దిగింది. కానీ, ప్రపంచ కప్‌లో జట్టు పరిమాణంపై ఉన్న పరిమితి కారణంగా ఆ లీగ్‌లో పాల్గొన్న నలుగురు ఆటగాళ్లకు జట్టులో చోటు దక్కలేదు. డిఫెండర్ అమన్‌దీప్ లక్రా, మిడ్‌ఫీల్డర్లు రాజ్ కుమార్ పాల్, రబిచంద్ర సింగ్ మొయిరాంగ్‌థెమ్, ఫార్వర్డ్ సెల్వం కార్తీ చోటు కోల్పోయారు. ప్రపంచ కప్‌లో పూల్ డిలో ఉన్న భారత్ ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత్ ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. తర్వాత ఒక్క పతకం కూడా సాధించలేదు. 1971లో కాంస్యం, 1973లో రజతం సాధించింది.

**భారత జట్టు:**

గోల్ కీపర్లు: మోహిత్ హెచ్ఎస్, సూరజ్ కర్కెరా. డిఫెండర్లు: జర్మన్‌ప్రీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), అమిత్ రోహిదాస్, జుగ్రాజ్ సింగ్, సంజయ్, సుమిత్, యశ్‌దీప్ సివాచ్. మిడ్‌ఫీల్డర్లు: రాజిందర్ సింగ్, ఆదిత్య అర్జున్ లాలాగే, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, నీలకంఠ శర్మ, వివేక్ సాగర్ ప్రసాద్. ఫార్వర్డ్‌లు: దిల్‌ప్రీత్ సింగ్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, అభిషేక్.

# స్పెయిన్ ఆటగాళ్లతో ఘర్షణ.. అర్జెంటీనా ఆటగాళ్లపై ఫిఫా దర్యాప్తు



ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ అనంతరం అర్జెంటీనా, స్పెయిన్ ఆటగాళ్ల మధ్య మైదానంలో ఘర్షణ జరిగింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఫిఫా తెలిపింది. ఎఫ్‌డీసీ (ఫిఫా క్రమశిక్షణా నియమావళి) నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై దర్యాప్తు కోసం క్రమశిక్షణా, ఎథిక్స్ ప్రాసిక్యూటర్‌ను నియమించామని పేర్కొంది. విచారణ పూర్తయిన తర్వాత వివరాలను బహిర్గతం చేస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. ఫిఫా ప్రపంచ కప్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలవాలని భావించిన డిఫెండింగ్ అర్జెంటీనాకు స్పెయిన్ షాక్ ఇచ్చింది. ఫైనల్‌లో 10 తేడాతో ఓడించింది. మ్యాచ్ అనంతరం స్పెయిన్ ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా.. అర్జెంటీనా ఆటగాడు లియాండ్రో పరెడెస్ కాస్త దూకుడుగా వ్యవహరించాడు. స్పెయిన్ ప్లేయర్లు ఎరిక్ గార్సియా, గావిలపైకి వెళ్లాడు. అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు వారిని కొట్టేందుకూ యత్నించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.





# కష్టకాలంలో.. విరాట్ భాయ్ అండగా నిలిచాడు: పి.వి. సింధు

భారత స్టార్ షట్లర్ పి.వి. సింధు ఇటీవల జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీకి ముందు రెండేళ్లపాటు సింధు కెరీర్ పరంగా చాలా ఇబ్బందులు పడింది. ప్రతి టోర్నీలో బరిలో దిగి ఒకటి, రెండు రౌండ్లలోనే ఇంటిముఖం పట్టింది. గాయాలు కూడా ఇబ్బంది పెట్టాయి. ఈ ఫామ్‌తో 2028 ఒలింపిక్స్ వరకూ కొనసాగుతుందా అన్న సందేహాలు కలుగుతున్న సమయంలో.. తనలో ఛాంపియన్ ఆట ఇంకా ఉందని చాటుతూ ఈ తెలుగమ్మాయి జపాన్ ఓపెన్‌లో చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. తన కెరీర్ కష్టకాలంలో ఉన్నప్పుడు.. టీమ్ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ అండగా ఉన్నట్లు సింధు పేర్కొంది. కోహ్లీ మాటలు తనలో స్ఫూర్తి నింపాయని తెలిపింది. ''నేను విరాట్ భాయ్‌కి ఎప్పుడూ రుణపడి ఉంటాను. నా కెరీర్ క్లిష్టమైన దశలో ఉన్నప్పుడు నేను కోహ్లీని సంప్రదించాను. వరుస గాయాలు, ఆశించిన ఫలితాలు రాకపోవడంతో సతమతమవుతున్న సమయంలో నన్ను అర్థం చేసుకునే వ్యక్తి ఒకరు నాకు అవసరమయ్యారు. కోహ్లీ నిమిషాల వ్యవధిలోనే స్పందించారు. మరుసటి రోజే మేము కలుసుకున్నాం. ఆయన ఇచ్చిన సలహాలు నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆయన చెప్పిన మాటలు నాకు, నా భర్త దత్తాకూ బాగా గుర్తుండిపోయాయి. కొన్ని సంభాషణలు మన ఆలోచనా తీరునే మార్చేస్తాయి. అటువంటి వాటిలో ఇదొకటి'' అని సింధు వివరించింది.

# ఇంగ్లండ్‌కు భారీ షాక్

దీ హండ్రెడ్ లీగ్ 2026కు ముందు బర్మింగ్‌హామ్ ఫీనిక్స్‌కు భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు కెప్టెన్, ఇంగ్లండ్ యువ సంచలనం జాకబ్ బెతల్ గాయం కారణంగా హండ్రెడ్ టోర్నీ నుంచి వైదొలిగాడు. భారత్‌తో జరిగిన మూడో వన్డేలో బెతల్ మోకాలికి గాయమైంది. మ్యాచ్ ముగిసిన తర్వాత అతడిని అస్పత్రికి తరలించి స్కాన్ చేయగా గాయం తీవ్రమైనదిగా తేలింది. దీంతో నెల రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని బెతల్‌కు వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అతడు హండ్రెడ్ లీగ్‌కు దూరమయ్యాడు. ఆగస్టు 19 నుంచి స్వదేశంలో శ్రీలంకతో ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు కూడా బెతల్ అందుబాటులో ఉండే సూచనలు కనిపించడం లేదు. ఆ తర్వాత జరిగే టీ20ల్లో బెతల్ ఆడే అవకాశముంది. కాగా ఈ యువ ఆటగాడు ప్రస్తుతం ఇంగ్లండ్ జట్టులో కీలక సభ్యునిగా ఉన్నాడు. ఇటీవల భారత్‌తో జరిగిన టీ20, వన్డే సిరీస్‌లోనూ బెతల్ సత్తాచాటాడు. ఇక బెతల్ గైర్హాజరీలో బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ జట్టు కెప్టెన్‌గా డొనావన్ ఫెరీరా వ్యవహరించనున్నట్లు ఈసీబీ వర్గాలు వెల్లడించాయి.




**బర్మింగ్‌హామ్ ఫీనిక్స్ జట్టు ఇదే**

రెహాన్ అహ్మద్, జో క్లార్క్, స్కాట్ కర్రీ, లారీ ఎవాన్స్, డొనోవాన్ ఫెరీరా, సాకిబ్ మహమూద్, మ్యాథ్యూ మోంట్‌గోమరీ, మిచ్ ఓవెన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, విల్ స్మీడ్, ఉస్మాన్ తారిక్, జోర్డాన్ థాంప్సన్, క్రిస్ వుడ్, సీన్ డిక్సన్, టామ్ హెల్మ్..

చురకలు



# రామ్‌చరణ్‌తో సుకుమార్ మూవీ

## హీరోయిన్‌గా రష్మిక అంటూ ప్రచారం

క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధమైనట్లు తెలుస్తుండగా, ఇప్పుడు హీరోయిన్ ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. 'ఆర్య' నుంచి 'పుష్ప 2' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమాలో కొత్త హీరోయిన్‌కే అవకాశం ఇచ్చారు. ఒకసారి నటించిన కథానాయికను వెంటనే మరో సినిమాలో రిపీట్ చేయలేదు. ఇదే ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. అయితే ఈసారి రామ్ చరణ్ సినిమా కోసం ఆ సెంటిమెంట్‌ను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు పరిశీలించినప్పటికీ, రష్మిక మందన్న పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు సుకుమార్‌తో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాల్లో రష్మిక సక్సెస్‌ఫుల్‌గా పనిచేయడంతో, మరోసారి ఆమెనే ఎంపిక చేయాలనే అభిప్రాయం టీమ్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. రామ్ చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకు ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు. ఈ ఫ్రెష్ పెయిర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం భావిస్తోందట. అంతేకాకుండా ప్రస్తుతం రష్మిక పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలతో దూసుకుపోతుండటం కూడా నిర్మాతలకు అదనపు బలంగా మారింది. ఆమె క్రేజ్ సినిమాకు అన్ని భాషల్లో మంచి బిజినెస్‌కు దోహదపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ రష్మికనే హీరోయి-ఎన్‌గా ఖరారు చేస్తే, సుకుమార్ తన కెరీర్‌లో తొలిసారి ఒకే హీరోయిన్‌ను వరుసగా రెండు చిత్రాల్లో తీసుకున్న దర్శకుడిగా నిలుస్తారు. అయితే ప్రస్తుతం ఇవన్నీ ప్రచారంలో ఉన్న వార్తలే. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే హీరోయిన్ ఎంపికపై పూర్తి స్పష్టత రానుంది.






# షూటింగ్‌లో గాయపడ్డ బాలయ్య

నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తుండగా, ఈ చిత్ర షూటింగ్ తాజాగా కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతుంది. అయితే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాలలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా, ఆయన అనుకోకుండా కాలు జారి కిందపడిపోయారు. దాంతో ఆయన మోకాలిక స్వల్ప గాయం అయింది. వెంటనే చిత్ర బృందం షూటింగ్ ఆపేసి బాలయ్యని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం ఇతర పరీక్షలు కూడా నిర్వహించారు. స్వల్ప గాయమే అయిందని, కంగారు పడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే కొన్ని రోజుల పాటు బాలయ్య విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమాచారం. ఇక సినిమాల విషయానికి వస్తే.. గోపిచంద్ మలినేనితో పాటు కొరటాల దర్శకత్వంలోను బాలయ్య ఓ చిత్రం చేస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని య-ువసుధ ఆర్ట్స్, ఎస్ఎల్‌వీ సినిమాస్ సంస్థలు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలకృష్ణ ఈ సినిమాలో గత చిత్రాలకు భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని, మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో కూడిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.



# టాక్సిస్ నుంచి మనసాగదే.. పాట విడుదల

యశ్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్' ్చ తూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 26న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా 'మనసాగదే.. ' అంటూ సాగే పాటను చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. తనిష్ బ్బా్చ, అర్సాన్ నిజామి, ఫహీమ్ అబ్దుల్లా స్వరాలు సమకూర్చిన ఈ పాటకు రామ జోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. సిద్ధార్థ్ బస్రూర్ ఆలపించారు. యశ్‌తో (జజీబర) పాటు, నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్‌లు ఈ మూవీలో నటిస్తున్నారు ఓ సరికొత్త యాక్షన్ డ్రామాగా్చ తూ మోహన్ దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు అర్థమవుతోంది.

# ఎన్టీఆర్,త్రివిక్రమ్ గాడ్ ఆఫ్ వార్ హీరోయిన్‌గా కియారాపై చర్చ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రం పురాణ గాథల స్ఫూర్తితో రూపొందనున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా అని వార్తలు వస్తుండగా.. ఎన్టీఆర్ ఇందులో శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు టాక్. కథలో కీలకమైన మహిళా పాత్రకు కియారా సరిపోతారని మేకర్స్ భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్టీఆర్, కియారా అద్వానీ ఇప్పటికే 'వార్ 2' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమాలో వారి మధ్య పూర్తి స్థాయి జోడీ కనిపించలేదు. కియారా నటించిన 'భరత్ అనే నేను' ఘన విజయం సాధించగా, రామ్ చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. దీంతో కొందరు అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో సెంటిమెంట్‌గా చర్చిస్తున్నారు. నటుడు సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న తర్వాత కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే



త్రివిక్రమ్ దర్శకత్వంలోని 'గాడ్ ఆఫ్ వార్' సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం.



# పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార



తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు.సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్య్ర దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com